ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

శనివారం 9 నవంబరు 2024



3 లక్షలకు తగ్గాయి..

- పట్టభద్రుల దరఖాస్తులకు ముగిసిన గడువు
- ప్రత్యేక సాఫ్టువేర్‌తో మల్టిపుల్ ఎంట్రీల తొలగింపు

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజక వర్గ శాసనమండలి ఎన్నిక కోసం దాఖలైన దరఖాస్తుల్లో మల్టిపుల్ ఎంట్రీలు వేలల్లో లెక్క తేలాయి. దాదాపుగా 43 వేలకు పైగా దరఖాస్తులు డబుల్, ట్రిపుల్ ఎంట్రీలు తేలాయి. దీంతో వాటిని ప్రత్యేక సాఫ్టువేర్ ద్వారా గుర్తించి ఏఈఆర్‌వో లాగిన్ల నుంచి ఎన్నికల సంఘం తొలగించింది. దీంతో దరఖాస్తుల సంఖ్య 3.43 లక్షల నుంచి 3 లక్షలకు తగ్గాయి. దరఖాస్తులు దాఖలు చేయడానికి గడువు తేదీ ఈ నెల 6వ తేదీ సాయంత్రం ముగియడంతో ఏఈఆర్‌వో, ఈఆర్‌వో లాగిన్లు ఫ్రీజ్ అయిపోయాయి. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ కావడంతో ఫారం-18 దాఖలుకు సీఈవోఆంధ్ర వెబ్‌సైట్‌లో అవకాశం ఉన్నది. అయితే గడువు తేదీ దాటిన తర్వాత దాఖలైనవి అధికారుల పరిశీలనకు రావు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం క్లెయిమ్‌లు/అభ్యంతరాల సమయంలో వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటుహక్కు కోసం గడువు ముగిసిన నేపథ్యంలో వాటి పరిశీలనని ఈసీ చేపట్టింది. తొలుత సాఫ్టువేర్ ద్వారా బహుళ దరఖాస్తులను తొలగించింది. దాంతో బాపట్ల జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా 20851, ఆఫ్‌లైన్‌లో 563, ఏలూరులో 13983, 1175, గుంటూరులో 92829, 1079, కృష్ణలో 49160, 6687, ఎన్‌టీఆర్‌లో 57268, 4801, పల్నాడు జిల్లాలో 49342, 2850 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఆన్‌లైన్‌లో వచ్చిన వాటిల్లో ఇప్పటివరకు 6394 దరఖాస్తులను ఆమోదించారు. ఏఈఆర్‌వోల వద్ద 268029, ఈఆర్‌వో వద్ద 8983 పెండింగ్‌లో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో వచ్చిన వాటిల్లో 27 దరఖాస్తులను తిరస్కరించారు. ఆఫ్‌లైన్‌లో దాఖలైన 17,155లో 728 ఆమోదించారు. 16427 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక బృందాలు

దరఖాస్తుల దాఖలుకు గడువు ముగిసిన దృష్ట్యా వాటి పరిశీలనకు ప్రత్యేక బృందాలను ఎన్నికల అధికారులు నియమించారు. బీఎల్‌వో క్షేత్ర పరిశీలనకు వెళ్లినప్పుడు కేవలం ఒరిజినల్ డిగ్రీ మాత్రమే పరిశీలించాలని ఈఆర్‌వో ఎస్ఎస్‌కే కాజావలి తెలిపారు. నివాస ధ్రువీకరణ కోసం ఓటరు ఐడీ/ఆధార్ మరే పత్రం అయినా సరిపోతుందన్నారు. ఎన్నికల సంఘం గుర్తించి 59 యూనివర్సిటీలలో దేని నుంచి డిగ్రీ ఉన్నా ఆమోదించాలన్నారు. అవి కానప్పుడు ప్రత్యామ్నాయం కూడా సూచించడం జరిగిందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించేందుకు తహసీల్దార్లు, ఎంపీడీవోలను ఏఈఆర్‌వోలుగా ఎన్నికల సంఘం నియమించింది. ఈ నేపథ్యంలో వారు దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలన చేయించేందుకు చర్యలు చేపట్టాలి. ఏఈఆర్‌వోల లాగిన్‌లోనే సింహభాగం 2,68,029 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ దృష్ట్యా బీఎల్‌వోలను వెంట పడి దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి రి మార్కులతో వాటిని ఈఆర్‌వో లాగిన్‌కు పంపాల్సి ఉన్నది.



తెనాలి: కొల్లిపర వద్ద ట్రాక్టర్లకు ఇసుక ఎత్తుతున్న కూలీలు

ఉచితమని వస్తే ఊరుకోం

ఇసుక ఉచితం.. ప్రభుత్వం ప్రకటించింది.. ముఖ్యమంత్రి చెప్పారు.. అని వస్తే ఊరుకునేది లేదు. మా ఇసుక. మా ఇష్టం.. అంటూ రీచ్‌ల వద్ద నేతలు, ఇసుక అక్రమార్కులు బరితెగిస్తున్నారు. ఉచిత ఇసుక విధానం.. నేతలకు, అక్రమార్కులకు వరంగా మారింది. సీఎం చెప్పినట్లుగా సొంత అవసరాల కోసం రీచ్‌ల వద్దకు వెళ్తే అక్కడి వారి దౌర్జన్యాలు, బెదిరింపులకు బలికావాల్సి వస్తోంది. సీఎం చెప్పారు మీరేందని ఎదురు తిరిగితే నదిలోకి దిగితే పాతరేస్తామని తెనాలి పరిధిలోని రీచ్‌ల వద్ద కొందరు బరితెగిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా ఉచిత ఇసుక అమలు కావడంలేదు. వైసీపీ హయాంలో మాదిరిగానే ఇప్పుడు కూడా నేతలు ఇసుక పేరుతో కాసులు పోగేసుకుంటున్నారు. ఇసుక అక్రమాల విషయంలో గత వైసీసీకి, ప్రస్తుత ప్రభుత్వానికి పెద్ద తేడాలేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. సామాన్యులు ఇబ్బంది పడకుండా ఇసుక తెచ్చుకునేందుకు ప్రభుత్వం కల్పించిన వెసులుబాటును అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకుని దందా చేస్తున్నారు. మరోవైపు మరికొందరు పంచాయతీ, పోలీసుల పేరుతో అధికార దందా సాగిస్తున్నారు.

- నదిలోకి ట్రాక్టర్ దిగాలంటే రూ.500 కట్టాలి.
- అందరికంటే ముందు లోడ్ చెయ్యాలంటే రూ.600 అదనం.
- బయటి నుంచి వచ్చిన ట్రాక్టర్‌కు రూ.1500 చెల్లిస్తేనే ఇసుక.
- పంచాయతీల్లో జరిగే రోడ్ల నిర్మాణానికి ఇసుక కావాలంటూ పంచాయతీ కార్యదర్శుల పేరు, కార్యాలయ స్టాంప్‌తో లేఖలు
- పోలీస్‌నంటూ రాత్రుళ్లు రెండు లారీలతో ఇసుక తరలింపు
- పల్నాడు జిల్లాల్లో రాత్రిళ్లు వందల కొద్దీ లారీలతో యథేచ్ఛగా ఇసుక దోపిడీ

- రీచ్‌ల వద్ద నేతల బెదిరింపులు
- నదీ మార్గంలో గండికొట్టి మరీ దౌర్జన్యం
- నగదు ఇవ్వకుంటే ట్రాక్టర్ దిగనివ్వని వైనం
- అధికారం మారినా కొనసాగుతున్న ఇసుక దందా
- పట్టించుకోని అధికారులు.. యథేచ్ఛగా అక్రమాలు
- అక్రమార్కులకు వరంగా మారిన ప్రభుత్వ వెసులుబాటు

తెనాలి, బాపట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమలు అవుతున్న ఉచిత ఇసుక విధానం. ఇసుక సామాన్యులకు కూడా సులభంగా అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్తూ.. ఇసుకలో నేతలు, వారి అనుచరులు జోక్యం చేసుకోవద్దని హెచ్చరిస్తున్నా ఆలకించే వారే లేరు. ఇసుక అక్రమ సంపాదనకు రుచిమరిగిన అక్రమార్కులు మాత్రం ఇంకా కాసులు దోచేస్తూనే ఉన్నారు. ప్రకాశం బ్యారేజికి ఎగువున, దిగువున ఇసుక అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ప్రజల సొంత అవసరాల కోసం నేరుగా రీచ్‌ల వద్దకు వచ్చి ఇసుకను తవ్వి ఎడ్లబళ్ల, ట్రాక్టర్లలో తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం వెసులుబాటు ఇవ్వగా ఇదే అవకాశంగా ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. నదులు, వాగులు, వంకల్లో మాత్రమే స్థానికులు తమ అవసరాలకు ఇసుకను తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంటే అసైన్డ్, పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అక్రమార్కులు తెగబడి సొమ్ము చేసుకుంటున్నారు. సొంత అవసరాలకు ఇసుక కోసం ముందస్తు అనుమతి తీసుకుని పర్మిట్ ఉండాలని నిబంధన ఉన్నా వాటిని పట్టించుకునే వారే లేరు. ఈ తవ్వకాల వెనక కీలకంగా వ్యవహరిస్తున్నది పాలకపార్టీ ద్వితీయశ్రేణి నేతాగణమే కావడంతో వారిపై చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనకడుగు

(మిగతా 6వ పేజీలో..)



తెనాలి: అరవింద వారధి దగ్గర పెదలంక వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లు

హెచ్చరించినా.. తగ్గేదిలేదు..

బొమ్మువానిపాలెం, కొల్లిపర, మున్నంగి, అత్తలూరి వారిపాలెం తదితర రీచ్‌ల వద్ద పక్షం రోజుల క్రితం వరకు ట్రాక్టర్‌కు రూ.వెయ్యి నుంచి రూ.1600 వరకు వసూలు చేశారనే ఆరోపణలతో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ పరిశీలించారు. ట్రాక్టర్‌కు రూ.600 మించి వసూలు చేయరాదని, అంతకు మించి వసూలు చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అయినా మరికొన్ని అడ్డదారులు సృష్టించుకుని వసూళ్లు మాత్రం ఆపలేదు. ఇసుక రీచ్‌లు ఉండే గ్రామాల పరిధిలోని ట్రాక్టర్‌లకు రూ.500 అదనంగా వసూలు చేస్తుంటే, బయట ప్రాంతాల నుంచి ఇసుక కోసం వచ్చే ట్రాక్టర్‌లకు రూ.వెయ్యి నుంచి రూ.1600 వరకు వసూలు చేస్తున్నారు. ముందుగా లోడింగ్ కావాలంటే అదనంగా రూ.600 చెల్లిస్తే కూ లీలే ఆ వాహనం దగ్గరకు వెళ్లి ఇసుక లోడ్ చేస్తున్నారు.

దుగ్గిరాల కానిస్టేబుల్‌నని చెప్పి..

దుగ్గిరాల మండలం పెదకొండూరు దగ్గర గత వారం నుంచి ఓ వ్యక్తి తాను దుగ్గిరాల కానిస్టేబుల్‌ననిచెప్పి ఏకంగా లారీలతోనే ఇసుకను తరలించేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పెదకొండూరు రీచ్ నుంచి ట్రాక్టర్లతో ఇసుక తెచ్చుకుంటే బిల్లులు చూపాలని దౌర్జన్యం చేసి, అనుమతి లేని ట్రాక్టర్లను అడ్డుకుని లారీల్లో తమతోనే ఇసుక లోడ్ చేయించుకెళ్తున్నారని ట్రాక్టర్ల యజమానులు వాపోతున్నారు. అయితే అతడు నిజంగా పోలీసా! లేక ఆ పేరుచెప్పి దౌర్జన్యానికి పాల్పడుతున్న నకిలీనా అనేది తేలాలి. దీనిపై తెనాలి రూరల్ పోలీస్ ఉన్నతాధికారులను ప్రశ్నిస్తే మాత్రం తమ కానిస్టేబుల్ ఎవరూ రారని, ఒకవేళ ఎవరైనా కానిస్టేబుల్ పేరుచెప్పి ఇసుక దందాకు సిద్ధపడితే సమాచారం ఇవ్వాలన్నారు.



బాపట్ల రూరల్ పరిధిలో బధిరుల పాఠశాల వెనుక జరుగుతున్న ఇసుక తవ్వకాలు(ఫైల్‌ఫొటో)

తీగలాగితే కదిలిన గంజాయి డొంక

- 20 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు?
- రామన్నపేటలోని వసతిగృహంలో తనిఖీలు.. 1.5 కేజీలు స్వాధీనం



గంజాయి పొట్లాలను స్వాధీనం చేసుకుంటున్న పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిఘా వర్గాల సమాచారంతో తీగలాగడంతో పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంజాయి డొంక కదిలింది. ఒకరి నుంచి ఒకరికి లింకులను ఛేదిస్తూ వెళుతున్న పోలీసులకు పెద్ద సంఖ్యలో ముఠా సభ్యుల జాబితా వెలుగులోకి వస్తోంది. ఇప్పటి వరకు 20 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. రామన్నపేట ఒకటో లైన్‌లోని అమిత్ బాయ్స్ హాస్టల్‌లో గంజాయి ఆకు అమ్ముతున్నారనే సమాచారం స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి వచ్చింది. ఈ క్రమంలో పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు ఎస్‌బీ సిబ్బందితో కలిసి హాస్టల్‌లో తనిఖీ చేశారు. ఓ కాలేజీలో బీకాం కంప్యూటర్స్ మూడో సంవత్సరం చదువుతున్న వినుకొండ మండలం పిచికలపాలేనికి చెందిన వై అనిల్‌కుమార్ అనే విద్యార్థి వద్ద 1.5 కేజీలు చిన్నచిన్న ప్యాకెట్లుగా కట్టిన గంజాయి ఆకు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతడ్ని విచారించగా కొరిటెపాడు నాలుగో లైన్‌కి చెందిన అదే కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న మన్నె తులసిరాం ఇచ్చినట్లు చెప్పాడు. దీంతో తులసీరామ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తనకు శ్రీనివాసరావు పేటకు చెందిన అల్తాఫ్ అనే అతను ఐదు రోజుల క్రితం ఇచ్చినట్లుగా చెప్పాడు. దీంతో శ్రీనివాసరావుపేటలోని అల్తాఫ్ దగ్గరకు వెళ్లి అతడ్ని విచారించగా ఏటుకూరు రోడ్డుకు చెందిన అల్తాఫ్ అనే వ్యక్తి ఇచ్చినట్లు చెప్పాడు. ఈ విధంగా పోలీసులు లింక్‌లను ఛేదిస్తూ వెళ్తుండగా ఇప్పటి వరకు 20 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇందులో అత్యధిక మంది విద్యార్థులే ఉండటం ఆందోళన కలిగించే విషయంగా చెప్పవచ్చు.

6

జీఐఎస్ పరిజ్ఞానంతో రాజధాని పనులు వేగవంతం

- ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్

8

చిలకలూరిపేటకు విడదల రజిని

- సొంత నియోజకవర్గానికి వెళ్లిన మాజీ మంత్రి
- తాడికొండకు బాలవజ్రబాబు నియామకం
- రెండు నియోజకవర్గాలకు వైసీపీ ఇన్‌చార్జిల మార్పు
- ముందే చెప్పిన ఆంధ్రజ్యోతి

6

అంతర్ రాష్ట్ర గజదొంగ అరెస్టు

- రూ. పది లక్షల బంగారు, వెండి వస్తువులు స్వాధీనం
- నిందితుడిపై రాష్ట్ర వ్యాప్తంగా 150కి పైగా కేసులు

శంకర్‌విలాస్ ఆర్వోబీ.. 2026 జూలైకి

- నిర్మాణ పనుల పూర్తికి శరవేగంగా అడుగులు
- ఆలస్యమైతే పెనాల్టీ విధించేలా టెండర్ నిబంధనలు
- ఐకానిక్ మోడల్‌లో అత్యాధునిక డిజైన్లతో బ్రిడ్జి నిర్మాణం
- అధికారులకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని లక్ష్యం

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శంకర్ విలాస్ రైల్వే వోవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని 2026 జూలై నాటికి పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకు అనుగుణంగా వేగవంతంగా అడుగులు వేయాలి.. అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులకు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆయన కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, మహమ్మద్ నసీర్‌అహ్మద్, గళ్లా మాధవి, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులతో కలిసి రైల్వే, జాతీయ రహదారులు, అర్ అండ్‌బీ ప్రాజెక్టులతో పాటు, గుంటూరులో పారిశుధ్యం, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. గుంటూరు నగరంలోని శంకర్ విలాస్ వద్ద నిర్మించనున్న ఆర్వోబీ పనుల ముసాయిదా డీపీఆర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ గుంటూరు నగరానికి గుండెకాయ వంటి శంకర్ విలాస్ బ్రిడ్జి ఐకానిక్ మోడల్‌లో అత్యాధునిక డిజైన్లతో నిర్మాణం ఉండేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. డీపీఆర్‌లు సిద్ధం చేసిన వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పనులు నిర్దేశించిన సమయానికే పూర్తి అయ్యేలా, ఆలస్యమైతే పెనాల్టీలు విధించేలా టెండరు నిబంధనలు రూపొందించాలని సూచించారు. నిర్మాణ సమయంలో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ మళ్లింపునకు సంబంధించి నగరపాలక సంస్థ, ట్రాఫిక్ పోలీసులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. స్థల సేకరణకు సంబంధిత యజమానులతో సమావేశం నిర్వహించి సాధ్యమైనంత వరకు వారిని ఒప్పించేలా నష్టపరిహారంపై నిర్ణయం తీసుకోవాలన్నారు. శ్యామలానగర్ రైల్వే గేటు వద్ద నాలుగు లైన్ల ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు రైల్వే శాఖకు అందించాలని రైల్వే అధికారులకు సూచించారు. మంగళగిరి నిడమర్రు వద్ద, ఇన్నర్‌రింగ్ రోడ్డు ఆటోనగర్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలన్నారు. నందివెలుగు రోడ్డులో పెండింగ్‌లో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులకు నిధులను ఆర్‌అండ్‌బీకి అందించేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బండారుపల్లి, కంతేరు, కొప్పురావూరు వద్ద ఉన్న ఆర్‌యూబీల వద్ద వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాజధాని నుంచి వినుకొండ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేలా రెవెన్యూ, జాతీయ రహదారుల శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. పెదకాకాని వద్ద జాతీయ రహదారి అప్రోచ్ పనులు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారి ఈస్ట్రన్ బైపాస్ నిర్మాణ పనుల భూసేకరణ ప్రక్రియ ప్రారంభించాలన్నారు.

నగరపాలక సంస్థలో పారిశుధ్యం పనుల్లో మార్పు రావాలని, అందుకు తగిన విధంగా జీఎంసీ కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని డాక్టర్ పెమ్మసాని తెలిపారు. పారిశుధ్య కార్మికులు పారిశుధ్య పనుల్లో కాకుండా డిప్యూటేషన్‌పై ఉంటే వారిని వెంటనే పిలిచి, పారిశుధ్య విధుల్లో కేటాయించాలని కమిషనర్‌ని ఆదేశించారు. వీధి కుక్కల సమస్యపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, రోజువారీ ఏబీసీ ఆపరేషన్లు పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ డిసెంబరు నుంచి నగరంలో 100 శాతం ఇంటింటి చెత్త సేకరణకు కార్యాచరణ సిద్ధం చేసుకున్నామన్నారు. సమావేశంలో జేసీ భార్గవతేజ, ట్రైనీ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో ఖాజావలి, జాతీయ రహదారుల పీడీ పార్వతీశం, రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీరు నోయల్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, ఆర్డీవో శ్రీనివాసులు, అడిషన్ కమిషనర్ సీహెచ్ ఓబులేష్, సీపీ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంవోహెచ్ శోభారాణి, డిప్యూటీ కమిషనర్లు డీ శ్రీనివాసరావు, టీ వెంకటకృష్ణయ్య, సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌విలాస్ ఆర్‌వోబీ ముసాయిదా డీపీఆర్‌ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

శనగకు.. సబ్సిడీ సెగ

- రాయితీ కోతతో రైతుపై విత్తన భారం
- గతంలో 40 శాతం.. ఇప్పుడు 25 శాతమే
- మార్కెట్‌లో కేజీ రూ.65.. ప్రభుత్వం 94కు సరఫరా

గుంటూరు సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రబీలో శనగ సాగుకు సిద్ధమవుతున్న రైతుకు రాయితీ సెగ తగులుతుంది. సబ్సిడీకి కోత పెట్టడంతో రైతుపై విత్తన భారం పడుతుంది. బహిరంగ మార్కెట్‌లో శనగల ధరకు, ఏపీ సీడ్స్ సరఫరా చేస్తున్న శనగల ధరకు భారీ తేడా కనిపిస్తుంది. సుమారు 13 వేల హెక్టార్లలో శనగ సాగుచేస్తారని వ్యవసాయశాఖ అంచనా నేపథ్యంలో ఈ ఏడాది 6500 క్వింటాళ్ల విత్తనాలను ప్రభుత్వం జిల్లాకు కేటాయించింది. ఇప్పటికే తాడికొండ, తుళ్లూరు, కాకుమాను, పెదనందిపాడు, ప్రత్తిపాడు మండలాలకు 770 క్వింటాళ్ల విత్తనాలు రైతు భరోసా కేంద్రాలకు తరలించారు. అయితే శనగ విత్తనాలపై గతంలో 40శాతం వరకు రాయితీ ఇచ్చేవారు. ఈ ఏడాది దానిని కేవలం 25శాతానికి పరిమితం చేశారు. దాంతో సబ్సిడీపై ఇస్తున్న విత్తనాల కన్నా, బయట మార్కెట్‌లో దొరుకుతున్న విత్తనాలు తక్కువ ధరకు లభ్యం అవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

ధరల్లోనే పేచీ

ఏటా రబీలో ఎర్ర, తెల్ల శనగల విత్తనాలు వ్యవసాయశాఖ సబ్సిడీపై రైతులకు సరఫరా చేస్తోంది. ఈ ఏడాది వ్యవసాయ శాఖ ద్వారా పంపిణీ చేస్తున్న జేజీ-11 (ఎర్ర శనగలు) రకం కిలో రూ.94, కేఏకే-2 (తెల్ల శనగలు, కాబూలి) రకం కిలో రూ.121 వరకు ధరలు నిర్ణయించారు. ప్రభుత్వం నిర్ణయించిన సబ్సిడీ పోను జేజీ-11 రకం కిలో రూ.70.50, కేఏకే-2 రకం కిలో రూ.90.75కు అందజేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ ధరల ప్రకారం ఒక్కో రైతుకు ఐదు ఎకరాలకు సరిపడా రెండు వందల కేజీల శనగ విత్తనాలు వ్యవసాయ శాఖ అందజేస్తుంది. అయితే ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో జేజీ-11 రకం శనగలు కేజీ రూ.65కే, కేఏకే-2 రకం కేజీ రూ.85లకు లభిస్తున్నాయి. ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న విత్తనాల ధరలకు బహిరంగ మార్కెట్‌లో దొరుకుతున్న విత్తనాల ధరలకు భారీ వ్యత్యాసం ఉంది. దాంతో రైతులు ఏపీ సీడ్స్ నుంచి సరఫరా చేస్తున్న వాటిని తీసుకునేందుకు ఆసక్తి చూపడంలేదు. గ్రామాల్లో ని వ్యవసాయ సహాయకులు ఇంటింటికి వెళ్లి అడిగినప్పటికీ రైతులు ఎవరూ ముందుకు రావడం లేదు. ముఖ్య ప్రజాప్రతినిధులు గ్రామాలకు వచ్చినప్పుడు రైతులు శనగ విత్తనాల సబ్సిడీ విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగా శనగ విత్తనాలపై సబ్సిడీ పెంచేలా చూడాలని కలెక్టర్ ద్వారా ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తిని పంపినట్లు సమాచారం.



శనగలను జల్లెడ పడుతున్న రైతులు

జీఐఎస్ పరిజ్ఞానంతో రాజధాని పనులు వేగవంతం



జీఐఎస్‌పై వివరిస్తున్న అదనపు కమిషనర్ మల్లారపు నవీన్

తుళ్లూరు, నవంబరు 8: (ఆంధ్రజ్యోతి) ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి జీఐఎస్ సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తే నిర్మాణ పనులు శరవేగంగా సాగుతాయని ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్ అన్నారు. ఎస్రీ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం జీఐఎస్ మ్యాపింగ్ టెక్నాలజీపై విజయవాడ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో సంస్థ ఉద్యోగులకు కార్యశాల జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, జీఐఎస్ సాంకేతికతతో నిర్మాణాన్ని ఒక ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తి చేయగలమన్నారు. ఈ టెక్నాలజీని ఉద్యోగులు అందిపుచ్చుకొని అత్యున్నత లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఎస్రీ ఇండియా ప్రతినిధి డాక్టర్ రమా చక్రవర్తి జీఐఎస్ మ్యాపింగ్ వినియోగాన్ని దృశ్య మాధ్యమం ద్వారా ఉద్యోగులకు వివరించి ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యశాలలో ఏపీ సీఆర్డీ అధికారులు పాల్గొన్నారు.

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

పెదకాకాని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో బీఈడీ కోర్సుకు ఆగస్టులో నిర్వహించిన మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను పరీక్షల నియంత్రణ అధికారి ఎ.శివప్రసాదరావు శుక్రవారం విడుదల చేశారు. ఈ పరీక్షలకు 9205 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 6923 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఫలితాలను విశ్వవిద్యాలయ వెబ్ సైట్ నుంచి పొందవచ్చునని పేర్కొన్నారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.1680 చెల్లించి ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

లక్ష్యసాధన కోసం నిరంతరం కృషి చేయాలి



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు (విద్య), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): యువత లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలని తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. సమావేశంలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఈ యువజనోత్సవాలను 'ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే ఇతివృత్తంతో నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లాలోని వివిధ కాలేజీల నుంచి పెద్ద ఎత్తున హాజరైన విద్యార్థులకు పోటీల్లో భాగంగా స్టోరీ రైటింగ్, చిత్రలేఖనం, డెక్లమేషన్, పొయిట్రీ, గ్రూప్ ఫోక్ డాన్స్, గ్రూప్ ఫోక్ సాంగ్, సోలో ఫోక్ డాన్స్, సోలో ఫోక్ సాంగ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పోలు నిర్వహించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థుల ఫిట్‌నెస్ కోసం ప్రభుత్వాలు ప్రత్యేకమైన పాలసీ తీసుకురావాలని సూచించారు. సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, స్టెప్ సీఈవో టీ.విజయలక్ష్మి, విజ్ఞాన్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

గెలుపు ముంగిట ఆంధ్ర



అర్పిత్ సింగ్



యశ్వంత్

మంగళగిరి సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న కూచ్ బెహర్ ట్రోఫీలో భాగంగా హిమాచల్‌ప్రదేశ్‌పై జరుగుతున్న నాలుగు రోజుల మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు విజయానికి చేరువలో నిలిచింది. ఆంధ్రా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 615 పరుగులు చేసి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన విషయం విదితమే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హిమాచల్‌ప్రదేశ్ జట్టు రెండో రోజు ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 50 పరుగులు చేసి గట్టి పోటీ ఇస్తున్నట్టే కనిపించింది. అయితే, మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 50 పరుగులతో బరిలో దిగిన హిమాచల్‌ప్రదేశ్ బ్యాటర్లు చేతులెత్తేశారు. ఆ జట్టు 60.4 ఓవర్లలో కేవలం 132 పరుగులు మాత్రమే చేసి ఆలౌటయింది. అర్పిత్ సింగ్ ఒక్కడే 53 పరుగులతో రాణించాడు. ఆంధ్రా బౌలర్లు బి.యశ్వంత్, ఏఎన్‌వీ లోహిత్ చెరో 4 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఫాలోఆన్‌తో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన హిమాచల్‌ప్రదేశ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 52 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేయగలిగింది. హిమాచల్‌ప్రదేశ్ బ్యాటర్ అర్పిత్ సింగ్ 47 పరుగులు చేయగా, ఆంధ్రా బౌలర్లు ఎన్.రాజేశ్, ఏఎన్‌వీ లోహిత్ చెరో రెండు వికెట్లు సాధించారు. హిమాచల్‌ప్రదేశ్ జట్టు 352 పరుగులు వెనుకబడి ఉంది. మరో రోజు మాత్రమే ఆట మిగిలి ఉండగా, ఆంధ్రా జట్టు విజయం సాధించాలంటే 5 వికెట్లు పడగొట్టాల్సి ఉంది.

ఉచితమని వస్తే ఊరుకోం

(5 పేజీ తరువాయి)

వేస్తున్నారు. పల్నాడు జిల్లాల్లో అయితే రాత్రిళ్లు వందల కొద్దీ లారీల్లో ఏకంగా ఎక్స్‌కవేటర్లతో ఎత్తి ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పల్నాటి రీచ్‌ల్లో తవ్వకాలకు అనుమతి లేకపోయినా నేతల ఘరానా దోపిడీ యథేచ్ఛగా సాగిపోతోంది. చాలా చోట్ల గత ప్రభుత్వంలో ఇసుక దందా నడిపిన వైసీపీ నాయకులు, వారి అనుచరులే మళ్లీ అక్రమాలకు పాల్పడుతుంటే, మరికొన్నిచోట్ల కూటమి నేతల పేరుచెప్పి వారి అనుచరులు ఇసుక దందాకు తెరతీస్తున్నారు. తాడేపల్లి మండలం మొదలు రేపల్లె మండలం వరకు కృష్ణా తీరంలో ఇసుక దందాకు అడ్డేలేకుండా పోతోంది. బ్యారేజి దిగువన గుంటూరు జిల్లాలో చిర్రావూరు, గుండిమెడ, పెదకొండూరు, అత్తలూరివారిపాలెం, వల్లబాపురం, మున్నంగి, కొల్లిపర, బొమ్మువానిపాలెం, చిలుమూరు, పెసర్లంక, గాజుల్లంక, జువ్వలపాలెం, ఓలేరు రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. వీటిలో మూడింటికి మాత్రమే మైనింగ్‌శాఖ అనుమతి ఇచ్చింది. మిగిలినవాటిలో స్థానిక కూటమి, వైసీపీ నేతలు హవా కొనసాగిస్తూ వసూళ్ల దందా సాగిస్తున్నారు. కొన్నిచోట్ల డబ్బు కట్టకుంటే వాహనాలు నదిలోకి దిగడానికి వీలులేదంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్న పరిస్థితులూ ఉన్నాయి. రీచ్‌ల వద్ద ఉన్న వారు అడిగినట్లు నగదు ఇవ్వకుంటే నదిలోకి దిగనివ్వమంటూ అడ్డుకుంటున్నారు. కొన్ని దగ్గర్ల ఇతరుల వాహనాలు నదిలోకి దిగే గాలు మార్గానికి గుంతలతో గండ్లు కొట్టేస్తున్నారు. కొల్లూరు మండలం పెసర్లంక, గాజుల్లంక, చిలుమూరు దగ్గర అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. స్థానికంగా ఉండే ట్రాక్టర్ల యజమానుల నుంచి కూడా జనసేన, టీడీపీ నాయకులు రూ.500 కప్పం వసూలు చేస్తున్నట్లు సమాచారం. అరవింద వారధి దగ్గర డబ్బు కట్టకుండా ట్రాక్టర్లు లోనికి దిగుతున్నాయని వారం క్రితం ఎక్స్‌కవేటర్‌తో గొయ్యితవ్వించేశారు.

పంచాయతీల పేరుతో..

గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో జరిగే నిర్మాణ అవసరాలకు ఇసుకకు ప్రత్యేక అనుమతి ఉంది. ఆయా పనుల వివరాలతో పంచాయతీ తీర్మానం చేసి దాని ఆధారంగా కార్యదర్శి లేఖను ఇస్తే ఆ మండల తహసీల్దార్ సిఫార్సుతో ఇసుక లోడ్ చేసుకోవచ్చు. లేదంటే పంచాయతీరాజ్ ఏఈ లేఖ ఇచ్చినా సరిపోతుంది. అయితే కొన్ని రీచ్‌ల వద్ద నేరుగా పంచాయతీ కార్యదర్శుల పేరు, స్టాంప్‌తో చేతిరాతతో ఉన్న లేఖలను చూపి వందల ట్రాక్టర్లలో ఇసుకను తరలించుకుపోతున్నారు. ఈ లేఖలు అసలా, నకిలీనా అంటే సమాధానం చెప్పేవారు పరిశీలించే వారే లేరు. నిజాంపట్నం, కర్లపాలెం, నగరం, చెరుకుపల్లి, బాపట్ల మండలాల్లోని పంచాయతీల పేరుతో లేఖలు ఎక్కువగా వస్తున్నాయి. పంచాయతీ లేఖ ఉందని పోలీసులూ కూడా వాటిని వదిలేస్తున్నారు. దీంతో ఇసుక అక్రమార్కులకు కాసులు పండుతున్నాయి.

రాత్రిళ్లు.. లారీల్లో తరలింపు

అమరావతి మండలం దిడుగు ఇసుక రీచ్ నుంచి గతంలో లారీల్లో ఇసుక అక్రమంగా తరలించిన విషయంలో వివాదం వెలుగుచూసింది. ఇది జరిగి వారం కూడా గడవకుండానే గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఎక్స్‌కవేటర్‌తో వంద లారీలకు ఇసుక లోడ్ చేసి తరలించేశారని తెలిసింది. అనుమతి లేకున్నా, పోలీసులు కూడా అన్ని లారీల్లో ఇసుక తరలిపోతుంటే తమకేం తెలియదన్నట్లు వదిలేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఒక్కో లారీకి రూ.12 వేలు నుంచి రూ.15 వేల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. ఈ లారీలన్నీ రాష్ట్రం దాటిపోతున్నాయని, మిరకొన్ని బల్క్ కింద రేటు మాట్లాడుకుని అవసరం ఉన్న పెద్ద బిల్డర్లకు దింపేస్తున్నారని సమాచారం.

ఖుసక పేరిట తమ్ముళ్ల మేత

సీఎం చంద్రబాబు హెచ్చరికలు, ఇసుక తవ్వకాలకు నిబంధనలను పట్టించుకోకుండా కొందరు నేతలు అధికారిక దందా చేస్తున్నారు. ఎక్కడైనా అధికారులు అడ్డుకుంటే తాము తవ్వుతున్నది ఇసుక కాదని ఖుసక అని ఎదురుదాడికి దిగుతున్నారు. ఖుసక అయినా అనుమతులు ఉండాలన్నా పట్టించుకోవడవడంలేదు. బాపట్ల జిల్లాలో చీరాల, వేటపాలెం, చినగంజాం, బాపట్ల రూరల్ మండలాల పరిధిలో అక్రమార్కులు ఏకంగా ఎక్స్‌వేటర్లతో ఇసుకను తవ్వి రవాణా చేస్తున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని ఇటీవల చీరాల టుటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తే వారిపైనే అక్రమార్కులు ఎదురుదాడికి దిగారు. బాపట్ల రూరల్ పరిధిలోని బధిరుల పాఠశాల వెనక అనుమతులు లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. కర్లపాలెం మండల పరిధిలోని దుండివారిపాలెం పంచాయతీ పరిధిలో కూడా ఇసుక అక్రమ తవ్వకాలు ఇష్టారీతిన జరుపుతున్నారు. అధికారపార్టీ ద్వితీయశ్రేణి నేతలే ఇసుక అక్రమ తవ్వకాల వెనుక ఉండటంతో కొందరు అధికారులు పట్టీపట్టనట్లుగా ఉన్నారు. బాపట్ల పరిధిలో పలు ప్రాంతాల్లో ఇసుక భూముల్లో పది నుంచి 15 అడుగుల వరకు లోతు పెట్టి మరీ తవ్వేసి తరలించుకుపోతున్నారు. ఒక్కో ట్రాక్టర్ రూ.5వేల నుంచి రూ.6వేల వరకు అమ్మేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులంతా బాపట్లలో ఉన్నా అక్రమ దందా యథేచ్ఛగా సాగుతుంది.

బాలికల లీగ్ మ్యాచ్ ఫలితాలు



శరభయ్య గుప్తా హైస్కూల్ క్రీడా మైదానంలో బాలికల ఫుట్‌బాల్ పోటీలు

సత్తెనపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ - 19 బాలుర, బాలికల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ - 19 బాల బాలికల పోటీల్లో ఫలితాలు ఇలా ఉన్నాయి. బాలికల లీగల్ మ్యాచ్ ఫలితాలు...చిత్తూరు జిల్లా జట్టు కృష్ణా జిల్లా జట్టుపై 3-0 గోల్ తేడాతో విజయం సాధించింది. విశాఖపట్నం జిల్లా జట్టు నెల్లూరు జిల్లా జట్టుపై 6-0, తూర్పు గోదావరి జిల్లా జట్టు కర్నూలు జిల్లా జట్టుపై 1-0 తేడాతో, చిత్తూరు జిల్లా జట్టు నెల్లూరు జిల్లా జట్టుపై జరిగిన మరొక మ్యాచ్‌లో 5-0 తేడాతో, విశాఖపట్నం జిల్లా కృష్ణా జిల్లా జట్టుపై 3-0 తేడాతో, అనంతపురం జిల్లా జట్టు తూర్పు గోదావరి జిల్లా జట్టుపై 10-0 తేడాతో, అనంతపురం జిల్లా కర్నూలు జిల్లా జట్టు పై 4-0 తేడాతో విజయం సాధించాయి. బాలుర లీగ్ ఫలితాలు ఇలా ఉన్నాయి. విజయ నగరం జిల్లా జట్టు పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై 1-0 తేడాతో, చిత్తూరు జిల్లా జట్టు తూర్పు గోదావరి జిల్లా జట్టుపై 1-0 తేడాతో, కర్నూలు జిల్లా జట్టు నెల్లూరు జిల్లా జట్టుపై 2-0 తేడాతో విజయం సాధించాయి. విశాఖపట్నం-కృష్ణా జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 0-0 తేడాతో డ్రాగా ముగిసింది. శ్రీకాకుళం జిల్లా జట్టు, ప్రకాశం జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ కూడా 0-0 తేడాతో డ్రాగా ముగిసింది.

అంతర్ రాష్ట్ర గజదొంగ అరెస్టు

- రూ. పది లక్షల బంగారు, వెండి వస్తువులు స్వాధీనం
- నిందితుడిపై రాష్ట్ర వ్యాప్తంగా 150కి పైగా కేసులు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

మంగళగిరి సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వరుస చోరీలకు పాల్పడుతున్న గజదొంగను మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై రాష్ట్రంలోని వివిధ పోలీసు స్టేషన్లలో 150కి పైగా కేసులు నమోదయ్యాయి. ఈ వివరాలను గుంటూరు నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన తోట శివకుమార్ అలియాస్ శివ విశాఖపట్నంలో స్థిరపడి నేర సామ్రాజ్యానికి తెరతీశాడు. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడ్డాడు. చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి రావడం, తిరిగి నేర ప్రవృత్తిని కొనసాగించడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో గత నెల 29వ తేదీన రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన తరువాత మంగళగిరి మండలం ఎర్రబాలెం, నవులూరు గ్రామాల్లో వరుసగా ఏడు చోట్ల చోరీలకు పాల్పడ్డాడు. కేసును ఛాలెంజింగ్‌గా తీసుకున్న పోలీసులు నిందితుడి కోసం విస్తృతంగా గాలించారు. ఎట్టకేలకు నిందితుడు శివతోపాటు అతనికి సహకరించిన యిమ్మిడి నాగేశ్వరరావులను శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 90 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండున్నర కిలోల వెండి, బంగారు తాపడంతో తయారు చేసిన రెండు చేతి గడియారాలు, ద్విచక్ర వాహనం కలిపి మొత్తం రూ.పది లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన మంగళగిరి రూరల్ పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ అభినందించి రివార్డులను అందజేశారని చెప్పారు. మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పివా పద్మశాలి భవన్‌కు శంకుస్థాపన



శంకుస్థాపన స్థలం వద్ద పివా ప్రతినిధులు

తాడేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కొలనుకొండలో కియా షోరూమ్ సమీపంలో పివా పద్మశాలి భవన్‌కు శంకుస్థాపన చేస్తున్నట్లు పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ (పివా) కేంద్ర కమిటీ అధ్యక్షుడు స్వర్గం పుల్లారావు తెలిపారు. ఆదివారం ఉదయం 7.06 గంటలకు జరిగే ఈ శంకుస్థాపనకు ముఖ్యఅతిథిగా మంత్రివర్యులు నారా లోకేశ్ విచ్చేస్తున్నారని, విశిష్ట అతిథులుగా ఎమ్మెల్సీలు పంచుమర్తి అనూరాధ, మురుగుడు హనుమంతరావు, రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, కాకినాడ వస్త్ర వ్యాపారి వింజమూరి భాస్కరరావు, అన్ని బ్రాంచిల అధ్యక్ష, కార్యదర్శులు, కేంద్ర కమిటీ కార్యవర్గం పద్మశాలి ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. శంకుస్థాపన కార్యక్రమ స్థలంలో పుల్లారావు మాట్లాడుతూ 50 మందితో పివాను స్థాపించామని నేడు 2700 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. పివా ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి విన్నకోట వెంకటేశ్వర్లు, కోశాధికారి నీలి కనకదుర్గా ప్రసాద్, సహాయ కార్యదర్శి మురుగుడు లక్ష్మీనారాయణ, వెంకన్న పాల్గొన్నారు.

అపోలో డెంటల్ హాస్పిటల్‌లో ఉచిత వైద్య పరీక్షలు

గుంటూరు మెడికల్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం ఒకటో లైన్‌లో గల అపోలో డెంటల్ హాస్పిటల్‌లో రోగులకు ఉచితంగా ప్రతి రోజూ దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అపోలో హాస్పిటల్స్ యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. రోగులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ కార్డుపై ఉచితంగా దంత చికిత్సలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు 8926378378 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మీటర్లపై ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

గుంటూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్లు కాలిపోవటం, ఆగిపోవటం, బిల్లింగ్ సమస్య వంటి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి అటువంటివి తక్షణమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్‌ఛార్జ్ ఎస్‌ఈ కేవీఎల్‌ఎన్ మూర్తి సూచించారు. గుంటూరు సర్కిల్ పరిధిలోని గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌ల ఈఈలు, డిప్యూటీ ఈఈలు, ఏఈలతో శుక్రవారం నల్లచెరువు డివిజనల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. ఎస్‌ఈ మాట్లాడుతూ కొత్త సర్వీసుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పంపిణీలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు.

డీఎస్సీ శిక్షణకు నిర్వహించే స్క్రీనింగ్ టెస్టు వాయిదా

గుంటూరు(విద్య), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిరుపేద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ కోసం నిర్వహించే స్క్రీనింగ్ టెస్టు వాయిదా వేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.మధుసూదనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రభావం కారణంగా పరీక్ష వాయిదా వేశామని, ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

నేడు, రేపు పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ క్యాంపెయిన్ డే

గుంటూరు సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల నేపథ్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో జిల్లా లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహించనున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. స్పెషల్ సమ్మరి రివిజన్ 2025లో భాగంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో 1.1.2025 నాటికి 18 సంవత్సరాలు నిండే వారు, ఇప్పటి వరకు ఓటు హక్కు లేని వారు ఫారం 6ను, ఓటర్ లిస్టుపై అభ్యంతరాలకు ఫారం-7ను, ఓటు వివరాలు తప్పుగా నమోదు అయినవారు ఫారం 8ను బూత్ లెవల్ అధికారులకు ఇవ్వచ్చని పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

నేటి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు

ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అండర్ 17 రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ ఆటల పోటీలు మండల పరిధిలోని యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజ్ సెక్రటరీ బత్తుల గంగాధర్‌రావు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

41,224 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 37,450 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 41,224 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 23,623 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	15000	334	8500	15500
నెంబరు. 5	8500	11900	నెంబరు. 5	95000	11500
273	11000	11500	273	10500	10500
341	8000	14000	341	9000	14500
4884	--	--	4884	11500	11500
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	17500	తేజ	8200	17200
బ్యాడిగి	8000	14500	బ్యాడిగి	9000	13000
దేవనూరు డీలక్స్	9900	13000	దేవనూరు డీలక్స్	8500	14000
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	5000	10500

పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయండి

● ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుధీర్‌బాబు

గుంటూరు(విద్య),నవంబరు 8: ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి, కమిషన్ నివేదిక వచ్చే వరకు 35 శాతం మధ్యంతర భృతిని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాలని ఎస్ఐఎస్టీఎఫ్ జాతీయ కార్యదర్శి జోసెఫ్ సుధీర్‌బాబు డిమాండ్ చేశారు. స్థానికంగా శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు సత్వరం పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు డీ పెదబాబు, డీకే సుబ్బారెడ్డి, వై శ్యాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి

న్యాయ సేవాధికార దినోత్సవం

గుంటూరు లీగల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): న్యాయసేవాధికార దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఓ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఎ చైర్మన్ వైవీఎస్‌బీ జీ పార్థసారధి హాజరై మాట్లాడారు. ప్రజల్లో న్యాయ సేవాధికార సంస్థ సేవలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ ఏడాది కాలంలో చేసిన కార్యక్రమాలు, పరిష్కరించిన కేసులు తదితర వివరాలను న్యాయ సేవాధికార కార్యదర్శి టీ లీలావతి వెల్లడించారు. కార్యక్రమంలో పర్మినెంట్ న్యాయ సేవాధికారసంస్థ చైర్మన్ పీవీ రాంబాబు, రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి వై నాగ రాజు, మూడో అదనపు జిల్లా న్యాయ మూర్తి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు, పోక్సో కోర్టు న్యాయ మూర్తి అనిత, ఎక్సైజ్ కోర్టు న్యాయ మూర్తి స్పందన పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా బాలిశెట్టి విజయ్



గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలోని శ్రీకృష్ణదేవరాయ బలిజ సత్రం (కాపు సత్రం)కు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా నగరానికి చెందిన బాలిశెట్టి విజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు శ్రీకృష్ణ దేవరాయ చారిటబుల్ ట్రస్ట్ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన గుంటూరులోని కాపు హాస్టల్‌కి ఇంచార్జ్ గా వ్యవహరిస్తున్నారు. భక్తులకు అందుబాటులో ఉంటూ, సత్రం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని విజయ్ తెలిపారు.

ఎఫ్ఆర్ఎస్ విధానంపై పునరాలోచించాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రవేశపెట్టిన ముఖహాజరు పద్ధతి(ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్)పై పునరాలోచన చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా కోరారు. స్థానిక మెడికల్ కళాశాల ఆవరణలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖహాజరును జీతాలకు అనుసంధానం చేయడంతో చాలామంది ఉద్యోగులు నష్టపోతున్నారని అన్నారు. నెట్‌వర్క్, ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యలతో చాలామంది సమయానికి హాజరు వేయలేకపోతున్నారని తెలిపారు. సరైన స్పష్టత లేని ఈ విధానంతో ఈ నెలలో 90 శాతం ఉద్యోగులు జీతాలు అందుకోలేకపోయారని అన్నారు. ప్రతి ఉద్యోగికి స్మార్ట్ ఫోన్ అందించి, నెట్‌వర్క్ సమస్యలను పరిష్కరించిన తర్వాతే ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలని అభిప్రాయపడ్డారు. సమస్యను రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని అన్నారు. సమావేశంలో సంఘ సభ్యులు కరీముల్లా షాఖాదారి, మురళీకృష్ణ, నాగేశ్వరరావు, సాంబశివరెడ్డి, నాగరాజు, పెదరత్తయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ధర్నా

గుంటూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లచెరువులోని విద్యుత్ డివిజనల్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ శ్రేణులు శనివారం ఉదయం నిరసన కార్యక్రమం నిర్వహించనున్నాయి. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో చార్జీల పెంపునకు నిరసనగా ధర్నా చేపట్టనున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని కాంగ్రెస్ కార్యకర్తలు డివిజనల్ కార్యాలయం వద్దకు తరలిరావాలని పిలుపు నిచ్చారు.

నేర్చుకున్న విషయాలు రైతులకు ఉపయోగపడాలి

గుంటూరు సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమగ్ర పోషక యాజమాన్యం శిక్షణలో నేర్చుకున్న విషయాలు రైతులకు ఉప యోగపడేలా చూడాలని ప్రాంతీయ వ్యవ సాయ పరిశోధనా సంస్థ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎస్ వి వి ఎస్ దుర్గాప్రసాద్ అన్నారు. ఆచార్య ఎన్ జి రంగా వ్యవ సాయ విశ్వవిద్యాలయం, గుంటూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో సమగ్ర పోషక యాజ మాన్యం పై పీఏసీఎస్ సిబ్బందికి గత 15 రోజులుగా జరుగుతున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది.



ఆకట్టుకున్న 'చంచల' నాటిక

గుంటూరు(తూర్పు), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికపై శుక్రవారం 'చంచల' నాటిక సందేశాత్మకంగా సాగింది. లక్ష్మీకుల శేఖర్ రచించిన ఈ నాటికకు డాక్టర్ జలదంకి రవీంద్ర దర్శకత్వం వహించారు. సీఎస్ మూర్తి, నాయుడు గోపి, పీ శివప్రసాద్, నుసుము నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికుల సమస్యలపై చర్చిస్తున్న కేంద్ర మంత్రి చంద్రశేఖర్, కలెక్టర్, జీఎంసీ కమిషనర్, ఎమ్మెల్యేలు తదితరులు

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం

● కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశాలు

● ఈపీఎఫ్‌పై అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

● ఈఎస్ఐ వైద్యసేవల్లో మున్సిపల్ కార్మికులకు ప్రాధాన్యమివ్వాలి

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలోని పారిశుధ్య కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐపై ఉన్న సమస్యలు సత్వరమే పరిష్కరించేలా కార్పొరేషన్, ఈపీఎఫ్, ఈఎస్ఐ, ఆప్కాస్ అధికారులను సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. కలెక్ట రేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో కలెక్టర్ నాగలక్ష్మి, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, శాసనమండలి సభ్యులు చంద్రగిరి ఏసురత్నం, శాసనసభ్యులు రామాంజనేయులు, నసీర్ అహ్మద్, గళ్లా మాధవితో కలిసి నగరపాలక సంస్థ కార్మికుల సమస్యలపై కార్మిక సంఘాల ప్రతినిధులు, ఈపీఎఫ్, ఈఎస్ఐ, ఆప్కాస్, బ్యాంకర్స్‌తో శుక్రవారం సమావేశం నిర్వ హించారు. కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు ఎదుర్కొంటున్న ఈపీఎఫ్, ఈఎస్ఐకి సంబంధించిన పలు సమస్యలను తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కారం దిశగా తీసుకోవాల్సిన చర్యలపై శాఖల వారీగా అధికారులతో మంత్రి సమీక్షించారు. పెమ్మసాని మాట్లాడుతూ ప్రధానంగా ఈపీఎఫ్‌లో పుట్టినతేదీ మార్పు, రుణాల మంజూరు విషయంలో సమస్యలు రాకుండా అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలన్నారు. ఈఎస్ఐ నుంచి అందే వైద్య సేవల్లో మున్సిపల్ కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వాలని, కృష్ణనగర్ ఈఎస్ఐ డిస్పెన్సరీలో తగిన మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఈఎస్ఐకి సంబంధించి అమరావతిలో 7 వందల పడకల అధునాతన ఆసుపత్రి, మెడికల్ కాలేజీ ఏర్పాటుకు కృషి చేసున్నట్లు చెప్పారు. ఈఎస్ఐ నుంచి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, జీఎంసీ కార్మికుల జీతం అకౌంట్ ఉన్న యూనియన్ బ్యాంకు నుంచి వ్యక్తిగత రుణాలు మంజూరుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈపీఎఫ్ అకౌంట్‌లలో కార్మికుల పుట్టిన తేదీలు, పేర్లలో తప్పుల సవరణకు సంబంధించి ఈపీఎఫ్ అధికారులు, నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. పులి శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెల 2వ గురువారం ప్రత్యేకంగా గ్రీవెన్స్ ఏర్పాటు చేశామని ,ఈపీఫ్, ఈఎస్ఐ అర్జీలపై జీఎంసీ నుంచి ప్రత్యేక దృష్టి సారించి, ఆయా విభాగాలతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు. అనంతరం నగరపాలక సంస్థ కార్మికులకు జీఎంసీ ద్వారా పూర్తి ప్రీమియం చెల్లించిన ప్రమాద బీమా పత్రాలను అందించారు. సమావేశంలో జీఎంసి అదనపు కమిషనర్ ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డీ శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, టీ వెంకట కృష్ణయ్య, సిఎంఒహెచ్ శోభారాణి, ఈపీఎఫ్ అదనపు కమిషనరు మాధవ శంకర్, ఈపీఎఫ్ ఈఎస్ఐ రామారావు, ఈఎస్ఎన్ కన్సల్టెంట్ రామారావు, ఎల్డీఎం మహిపాల్ రెడ్డి, కార్మిక సంఘాల నాయకులు వరికల్లు రవికుమార్, మాల్యాద్రి, మధుబాబు, ముత్యాలరావు, సోమి శంకరరావు పాల్గొన్నారు.

గుంటూరును నంబర్ వన్‌గా నిలబెట్టడమే లక్ష్యం

'విద్యార్థుల పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం అనేది అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయి. సాధించాలనే కసితో పనిచేస్తే కచ్చితంగా ఆశించిన ఫలితాలు వస్తాయని నమ్ముతాను. ప్రగతి పరంగా గుంటూరును ఏపీలో నంబర్ వన్ గా, ఏపీని ఇండియాలో నంబర్ వన్ గా, అలాగే ప్రపంచంలో ఇండియా నంబర్ వన్ గా నిలపాలన్నదే నా లక్ష్యం. ఆ లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా మీ అందరి సలహాలు, సూచనలు తెలుసుకోవాలనే ఉద్దేశంతో సమావేశం ఏర్పాటు చేశాము.' అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత, ఎయిడెడ్, మునిసిపల్ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతపై ప్రత్యేక సమావేశాన్ని కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. ఉత్తీర్ణతా శాతానికి అడ్డుగా ఉన్న కారణాలేంటో చెప్పాలని అడిగారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు స్పందిస్తూ తమ పాఠశాలలో కొన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేరని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా పీఎస్ సబ్జెక్టు ఉపా ధ్యాయుల కొరత ఎక్కువగా ఉందని ఉపాధ్యాయులు తెలిపారు. 2014 - 19 హయాంలో టీడీపీ మిత్రుత్వంలో పాఠశాలల్లోని విద్యార్థులకు సాయంత్రం వేళ స్నాక్స్ అందజేసి మరీ ప్రత్యేక ట్యూషన్లు నిర్వహించారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో పిల్లలకు స్నాక్స్ కూడా అందజేయకపోవడంతో ప్రత్యేక క్లాసులు ఆపివేయాల్సి వచ్చిందని, తద్వారా ఆ తర గతుల కొరత ప్రభావం టెన్త్ ఫలితాలపై పడిందని చెప్పారు. తెనాలిలోని చంద్రబాబునాయుడు కాలనీలోని పాఠశాలలో వర్షపు నీరు నిలబడిపోయి తరగతి గదుల్లో క్లాసుల నిర్వహణకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలపై పెచ్చులు ఊడి కింద పడిపోవడంతో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెప్పడంతో పెమ్మసాని స్పందిస్తూ త్వరలోనే ఆ స్కూల్ పరిశీలనకు వస్తా నని ఉపాధ్యాయులకు తెలిపారు. సమస్యలను గుర్తించి తగు నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

యానాదికాలనీ వాసులకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపండి

● పెమ్మసానికి దళిత, బహుజన సంఘాల విజ్ఞప్తి

గుంటూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకుమానువారితోట శివారులో నివాసం ఉంటున్న యానాదుల కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఇళ్ళ స్థలాలను చూపాలని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు పలువురు దళిత, బహుజన సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. నగరంలోని కార్యాలయంలో శుక్రవారం దళిత, బహుజన సంఘాల నాయకులు కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్థానిక బొంగరాలబీడు వెనుకనున్న ప్రాంతంలో రెండు దశాబ్దాలుగా నివాసముంటోన్న యానాది కాలనీ వాసులను ఖాళీ చేయాలని నగరపాలక సంస్థ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విజ్ఞప్తిపై పెమ్మసాని సానుకూలంగా స్పందించారని, సమస్య పరిష్కరిస్తామని హామి ఇచ్చినట్లు దళిత సంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బహుజన మహాసభ కేంద్ర కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్‌సింగ్, జూపూడి శ్రీనివాసరావు, తాడికొండ నరసింహారావు, ముత్తయ్య ఉన్నారు.

ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రికి పెట్ స్కాన్ మెషిన్

● రూ.18 కోట్ల విలువైన స్కాన్ పరికరం

గుంటూరు మెడికల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రేడియాలజీ దినోత్సవం సందర్భంగా గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి రేడియాలజీ విభాగానికి రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఆసుపత్రిలోని నాట్కో కేన్సర్ సెంటర్‌కు రూ.18 కోట్ల విలువైన పెట్ స్కాన్ (పాజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ స్కానింగ్) పరికరం త్వరలో అందజేయనున్నట్లు తెలిపింది. పలు రకాల కేన్సర్ వ్యాధుల నిర్ధారణ, చికిత్సలకు వ్యాధి ఏ మేరకు లొంగింది? తదితర అంశాలను తెలుసుకొనేందుకు ఖరీదైన పెట్ స్కానింగ్ ఉపయోగపడుతుంది. న్యూఢిల్లీకి చెందిన బ్రాన్ ల్యాబోరేటరీస్ లిమిటెడ్‌కు పెట్ స్కాన్ మెషిన్‌ను గుంటూరు జీజీహెచ్‌కు సరఫరా చేయాల్సిందిగా కోరుతూ ప్రభుత్వం పర్చేజింగ్ ఆర్డర్‌ను జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి నాటికి పెట్ స్కాన్ ప్రభుత్వాస్పత్రికి అందుబాటులోకి వస్తుందని వైద్య వర్గాలు భావిస్తున్నాయి. సాధారణ కేన్సర్ రోగులతో పాటు ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద చికిత్సలు పొందే కేన్సర్ రోగులకు కొన్నిసార్లు పెట్ స్కాన్ పరీక్షలు చేయించాల్సి వస్తోంది. ప్రైవేటు వైద్యరంగంలో ఈ పరీక్షకు రూ.25 వేలు వసూలు చేస్తు న్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద వచ్చే రోగులకు రూ.18 వేలు నుంచి రూ.20 వేల వరకు ఛార్జీ చేస్తున్నారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వమే ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకు చెల్లించాల్సి వస్తోంది. ఇకపై పెట్ స్కాన్ మెషిన్ ప్రభుత్వాస్పత్రిలోకి అందుబాటులోకి వస్తే రోగులకు ఇబ్బందులు తప్పడంతో పాటు లక్షలాది రూపాయల ప్రభుత్వ ధనం ఆదా అవుతుంది.

ప్రభుత్వాస్పత్రిలో రేడియోగ్రఫీ దినోత్సవం




రేడియాలజీ దినోత్సవంలో వైద్య సిబ్బంది

రేడియాలజీ వైద్య రంగంలో ఆధునిక సాంకేతికతతో కూడిన పరీక్షలు.. రోగ నిర్ధారణను సమర్థవంతంగా ముందుకు తీసుకు వెళుతున్నాయని ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి ఇన్‌చార్జ్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ విజేత తెలిపారు. ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి రేడియాలజీ విభాగంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ రేడియోగ్రఫీ దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. తొలుత రేడియాలజీ పితామహుడు విల్హెమ్ కాన్రాడ్ రాంట్‌జెన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేడియాలజీ విభాగానికి సంబంధించి తాజా సాంకేతిక పరిజ్ఞానం, రోగ నిర్ధారణ, నివారణ అంశాలపై పవర్ పాయింట్‌ప్రజెంటేషన్ ద్వారా నిపుణులు వివరించారు. కార్యక్రమంలో రేడియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అంకమ్మరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రమాకాంత్, డాక్టర్ ప్రశాంతి, పీజీ విద్యార్థులు, రేడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

కొరిటెపాడులో తృటిలో తప్పిన ఘోర ప్రమాదం

● రోడ్డు పక్కన నిలిపిన కారుపై విరిగిపడ్డ భారీ చెట్టు కొమ్మ



కొరిటెపాడు మెయిన్ రోడ్డు పక్కన కారుపై విరిగిపడ్డ భారీ చెట్టు కొమ్మ

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొరిటెపాడులో శుక్రవారం ఘోర ప్రమాదం తృటిలో తప్పింది. హరిహరమహల్ నుంచి కొరిటెపాడు గాంధీ బొమ్మ వైపు వెళ్లే మార్గంలో మెయిన్ రోడ్డుపై డివైడర్ ముగింపు వద్ద ఎడమ చేతి వైపున ఉన్న భారీ వృక్షానికి చెందిన ఓ పెద్ద కొమ్మ విరిగిపడింది. అయితే, ఆ సమయంలో ఓ కారు డ్రైవర్ రోడ్డు పక్కనే కారు పార్కింగ్ చేసి మెడికల్ షాప్‌లోకి వెళ్లేందుకు కిందకు దిగుతున్నాడు. కుడివైపు నుంచి డోర్ తీసుకొని కిందకు దిగుతున్న సమయంలోనే కారుకు ఎడమ వైపున భారీ వృక్షం కొమ్మ ఒక్కసారిగా కారుపై పడిపోయింది. ఆ సమయంలో డ్రైవర్ మినహా కారులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఆ సమయంలో అక్కడ కారు పార్కింగ్ చేయని పక్షంలో ట్రాఫిక్ ఉండేది. అదే జరిగితే పెద్ద ప్రమాదమే జరిగి ప్రాణాపాయం సంభవించి ఉండేది. కొరిటెపాడు ఏర్పడినప్పటి నుంచి ఈ వృక్షంతో పాటు మరో రెండు చెట్లు కొరిటెపాడు మెయిన్ రోడ్డు పక్కన ఉన్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా ఆయా చెట్లను తొలగించాలని నగరపాలక సంస్థ అధికారులు నిర్ణయించినప్పటికీ స్థానికుల సూచనతో వారు తమ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు.

నీటి మీటర్ల చార్జీలు వెంటనే చెల్లించాలి

● జీఎంసీ కమిషనర్



రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో బకాయి ఉన్న నీటి మీటర్ల చార్జీలను వెంటనే పూర్తిగా చెల్లించాలని, లేని పక్షంలో ట్యాప్‌లను డిస్ కనెక్ట్ చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కమిషనర్ చాంబర్‌లో అదనపు కమిషనర్ తో కలిసి శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు,ఇన్‌స్పెక్టర్లతో నీటి మీటర్ల చార్జీలు, ఆస్తి, ఖాళీ స్థల పన్ను వసూళ్ల వేగవంతంపై సమీక్షించారు. నీటి మీటర్ల బకాయిలు లక్షల్లో ఉండటాన్ని గమనించిన ఆయన సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బకాయిల వసూళ్లకు ప్రత్యేక బృందాల ద్వారా 3 రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వసూళ్ల వేగవంతం చేయాలని ఆదేశించారు. బకాయిలు చెల్లించని వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో వెనుకాడ బోమని, బకాయిలు ఉన్న గృహ యజమానులు 60 రోజుల్లో చెల్లించకపోతే కుళాయిని తొలగిస్తామని అన్నారు. అనధికార కుళాయిలను గుర్తించామని, వాటిని వెంటనే తొలగించేందుకు ఏఈల వారీగా చర్యలు తీసుకుంటామన్నారు. బకాయి ఉన్న ఆస్తి, ఖాళీ స్థల పన్నులు చెల్లించి రశీదులు పొందాలన్నారు. మీటర్ రీడర్లు ప్రతి రోజు 50 మీటర్ల రీడింగ్ తీసి, ఆన్ లైన్ లో అప్‌లోడ్ చేసి రోజువారీ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రెవెన్యూ వసూళ్లలో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందికి నగదు పురస్కారాలు అందిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు రెహమాన్, రవికిరణ్ రెడ్డి, సాదిక్ బాషా పాల్గొన్నారు.


నగరాభివృద్ధికి యునిడో భాగస్వామ్యం అభినందనీయం

గుంటూరు నగరాభివృద్ధిలో యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (యునిడో) భాగస్వామ్యం ఎంతో అభినందనీయమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి యునిడో సీనియర్ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ నందపాల్ సింగ్, నేషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ దీపికా శ్రీపాద్‌లతో శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో చర్చించారు.శ్రీనివాసులు మాట్లాడుతూ కాలుష్యరహిత నగరంగా గుంటూరుని మార్చుకోవడంలో యునిడో గ్లోబల్ ఎన్విరాన్మెంట్ ఫండ్ (జిఈఎఫ్) ద్వారా సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. ఇప్పటికే సంగంజాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లో ఫ్లోటింగ్ సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు, ఈ-ఆటోలకు రూ.10 కోట్ల నిధులు అందించారని తెలిపారు. యునిడో సహకారంతో రానున్న కాలంలో గుంటూరు నగరం స్వచ్ఛ నగరంగా, కాలుష్యరహిత నగరంగా అభివృద్ధి చేసుకోవడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు పూర్తి చేసిన ప్రాజెక్ట్ లకు సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్ సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

సౌత్ డీఎస్పీగా మల్లికార్జునరావు

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) :ఎన్నో నెలలుగా ఖాళీగా ఉన్న సౌత్ డీఎస్పీ పోస్టు ఎట్టకేలకు భర్తీ అయింది. సౌత్ డీఎస్పీగా పీ మల్లికార్జునరావును నియమిస్తూ శుక్రవారం డీజీపీ ద్వారకాతిరుమల ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 మంది డీఎస్పీలకు పోస్టింగ్స్ లభించాయి. ఇందులో భాగంగానే ఈ పోస్టును కూడా భర్తీ చేశారు. కాగా, సౌత్ డీఎస్పీగా గతంలో మహబూబ్ బాషా పనిచేశారు ఎన్నికల ముందు నియమితులైన ఆయన ఎన్నికల అనంతరం సుమారు రెండు నెలలు పాటు విధులు నిర్వహించారు. ఆ తర్వాత జరిగిన డీఎస్పీల బదిలీలలో భాగంగా అన్ని సబ్ డివిజన్లకు డీఎస్పీ లను నియమించినప్ప టికీ సౌత్‌కు మాత్రం నియమించలేదు. అప్పటి నుంచి ఎస్సీఎస్టీ సెల్ డీఎస్పీగా ఉన్న పీ మల్లికార్జునరావు సౌత్ కు ఇన్‌చార్జి డీఎస్పీగా కొనసాగుతున్నారు. తాజాగా జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్న మల్లికార్జునరావునే సౌత్ డీఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మల్లికార్జునరావు గతంలో జిల్లాలో ఎస్సైగా ,సిఐ గా విధులు నిర్వహించారు.

ఏఎన్‌యూలో ఉర్దూ బాషా దినోత్సవం



ఉర్దూ బాషా దినోత్సవం సందర్భంగా ఏఎన్‌యూలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్

పెదకాకాని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ ఉర్దూ బాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు విభాగం సమన్వయకర్త డాక్టర్ షాబాజ్ అధ్యక్షత వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న గుంటూరు తూర్పు శాసన సభ్యులు నజీర్ అహ్మద్ మాట్లాడుతూ ఉర్దూ బాషా దినోత్సవ గొప్ప తనాన్ని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం 'ఉర్దూ'కు అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఉర్దూ భాషపై విద్యార్థులు మక్కువ పెంచుకొని ప్రపంచ దేశాల్లో ఉపాధి పొందాలని సూచిం చారు. ముఖ్యఅతిథి, తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ ఉర్దూ విభాగం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అన్నారు.వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహు మతులు అందజేశారు. ఈ వేడుకల్లో ఆచార్య కే రత్న షీలామణి, ఆచార్య జీ సింహాచలం, డాక్టర్ ఫౌజియా, డాక్టర్ షబ్బీర్ బాషా, నళిని పాల్గొన్నారు.

జిల్లాకు 200 ఎలక్ట్రికల్ బస్సులకు ప్రతిపాదన

● మంగళగిరికి100, గుంటూరుకు మరో 100 బస్సులు

● వాణిజ్య ఆదాయం పెంపునకు చర్యలు

● డీపీటీవో ఎమ్ రవికాంత్



గుంటూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 200 ఎలక్ట్రికల్ బస్సుల కోసం కొత్తగా ప్రతిపాదనలు చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) ఎమ్ రవికాంత్ తెలిపారు. నిత్యం విభజిత జిల్లాలో గుంటూరు-1,2 డిపోలతో పాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల నుంచి రోజువారీగా లక్షా 20 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 389 బస్సులు ఉండగా నిత్యం లక్షా 45 వేల కిలో మీటర్లు తిరుగుతూ ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చుతున్నాయని తెలిపారు. జిల్లాలో ఆర్టీసీ లాభనష్టాలతో పాటు తాజా పరిస్థితులపై రవికాంత్ శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

జిల్లాలో ఆర్టీసీ ఆదాయం ఎలా ఉంది....

డీపీటీవో: జిల్లాలో నిత్యం ప్రయాణికుల నుంచి ఛార్జీల రూపంలో రూ. 60 లక్షల ఆదా యం వస్తుంది. గత ఏడాదితో పోల్చుకుంటే నష్టాలను తగ్గించగలిగాం. గత ఏడాది నష్టం రూ. 10 కోట్లు ఉంటే ప్రస్తుతం రూ. 9 కోట్లకు తగ్గించగలిగాం.

కొత్త బస్సుల ప్రతిపాదనలు ఏమైనా ఉన్నాయా....

డీపీటీవో : జిల్లాకు 95 కొత్త బస్సులు వస్తున్నాయి. ఇందులో ఇప్పటికే 53 రాగా, మరో 42 రావాల్సి ఉంది. ఇంకా మరో 200 ఎలక్ట్రికల్ బస్సులు ప్రతిపాదనలు పంపాం. గుంటూరు, మంగళగిరి నుంచి ఒక్కో డిపో నుంచి 100 బస్సులు నడిపేందుకు ప్రతిపాదనలు చేశాం.

అనేక గ్రామీణ ప్రాంతాలకు 'పల్లెవెలుగు' లేదని ఫిర్యాదు లొస్తున్నాయి....

డీపీటీవో : అది వాస్తవమే కానీ, రోడ్ల సౌకర్యం లేక అందడం లేదు. ప్రయాణికులు కోరిన అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తాం. కొత్త బస్సులు వస్తే మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వస్తాయి.

కమర్షియల్ ఆదాయం కోసం ప్రతిపాదనలు ఉన్నాయా?

డీపీటీవో: కమర్షియల్ ఆదాయం కోసం ఇప్పటికే ఆర్టీసీ ఖాళీ స్థలాలను అద్దె ప్రాతిపాదిక (బీవోటీ) కింద ఇచ్చేందుకు ప్రతిపాదనలు చేస్తున్నాం. ఇప్పటికే కమర్షియల్ ఆదాయం గతంలో నెలకు రూ.45 లక్షలు ఉన్న దాన్ని రూ. 60 లక్షలకు పెంచగలిగాం.

సిబ్బందిపై వచ్చే ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటారా?

డీపీటీవో: సిబ్బందిపై ఫిర్యాదులొస్తే శాఖాపరమైన విచారణ జరిపి చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో ఎటువంటి వివక్ష లేదు. ముఖ్యంగా సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించటం, ప్రవర్తనపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ప్రయాణికుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు సిబ్బందిపై ఫిర్యాదుల కోసం 'డయల్ యువర్ డీఎం', 'డయల్ యువర్ డీపీటీవో' కార్యక్రమాలు కూడా చేపడుతున్నాం.



చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న క్రీడా సంఘాల సభ్యులు

నూతన పాలసీతో క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి

● జిల్లా బ్యాడ్మింటన్ సంఘ కార్యదర్శి దామచర్ల శ్రీనివాస్

గుంటూరు(తూర్పు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్పోర్ట్స్ నూతన పాలసీతో క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి వస్తుందని జిల్లా బ్యాడ్మింటన్ సంఘ కార్యదర్శి దామచర్ల శ్రీనివాస్ అన్నారు. స్థానిక నవభారత్‌నగర్‌లోని నాథ్‌వెల్నెస్ వరల్డ్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం జరిగింది. శ్రీనివాస్ మాట్లాడుతూ దేశం లోనే అత్యున్నత క్రీడా పాలసీని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్లుగా నిర్వీర్యమైన క్రీడ లకు ప్రాణం పోశారని, స్పోర్ట్స్ కోటా 3 శాతం పెంపుదలతో ఉద్యోగాల్లో క్రీడా కారులకు ప్రాముఖ్యత పెరుగుతుందని అన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చల్లా వెంకటేశ్వరరెడ్డి, వేణుగోపాలరావు మాట్లాడుతూగత ప్రభుత్వం భారీగా పెంచిన శిక్షణ ఫీజు లను తగ్గించాలని కోరారు. అనంతరం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రసాము క్రీడాకారుడు డాక్టర్ ఖరీదు సాంబయ్యను సత్కరించారు. కార్యక్రమంలో పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల కరస్పాండెంట్ పాటి బండ్ల విష్ణువర్ధన్, అథ్లెటిక్స్ సంఘ జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాదు, జీ సాంబశివరావు, ఎన్ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కేసులో హరికృష్ణారెడ్డి, సుధారాణిరెడ్డి కోర్టులో హాజరు

● అర్ధరాత్రి వరకు ఇరుపక్షాల హోరాహోరీ వాదనలు

● బెయిలా? రిమాండా? అనే దానిపై ఉత్కంఠ

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీవీ 5 ఎండీ బీఆర్ నాయుడు తదితరులపై అసభ్యకరమైన పోస్టింగ్స్ పెట్టిన కేసులో నిందితులైన రౌడీషీటర్ కళ్ళం హరికృష్ణారెడ్డి, సుధారాణిరెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం రాత్రి ఆయనను లాలాపేట పోలీసులు మూడో అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. అర్ధరాత్రి వరకు కోర్టులో ఇరుపక్షాల మధ్య సుదీర్ఘ వాద నలు జరిగాయి. నిందితునికి బెయిల్ ఇవ్వాలా లేదంటే రిమాండ్‌కు పంపాలా అనే దానిపై మెజిస్ట్రేట్ ఆదేశాల కోసం ఇరుపక్షాలు అర్ధరాత్రి వరకు కోర్టు వద్దే ఎదురు చూస్తున్నాయి. పవన్ కల్యాణ్‌ను, ఆయన కుమార్తెలను కించపరిచే విధంగా పోస్టింగ్స్ పెట్టిన మహిళ పెద్దిరెడ్డి సుధారాణిని అదుపులోకి తీసుకున్న కొత్తపేట పోలీసులు శుక్రవారం రాత్రి రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ దీప్తి ఎదుట హాజరు పరిచారు. ఇరు పక్షాల మధ్య హోరాహోరీగా వాదనలు జరిగాయి.

చిలకలూరిపేట సీఐ కొట్టారని మెజిస్ట్రేట్‌కు ఫిర్యాదు

తనను సోషల్ మీడియా కేసులో అదుపులోకి తీసుకున్న చిలకలూరిపేట సీఐ రమేష్ కొట్టారని నిందితురాలు సుధారాణి మెజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మెజిస్ట్రేట్ ఆమె స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఆమెను అదుపులోకి తీసుకున్న చిలకలూరిపేట పోలీసులు 41ఎ నోటీస్ జారీ చేసి పంపారు.

'వలంటీర్ల ఆవేదన' సదస్సును జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల అరవై వేల మంది మంది వలంటీర్లకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం విజయవాడలో జరిగే వలంటీర్ల ఆవేదన సదస్సును జయప్రదం చేయాలని అఖిల భారత యువజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి పిలుపు నిచ్చారు. స్థానికంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు.

జగన్ అమాయకపు వ్యాఖ్యలు హాస్యాస్పదం : కనపర్తి



గుంటూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సాక్షిగా నాడు ప్రతిపక్షనేత చంద్ర బాబునాయుడిని ఆయన కుటుంబసభ్యులను వైసీపీ మంత్రులు, శాసనసభ్యులు అతిజుగుప్సాకరంగా మాట్లాడుతుంటే వికటాట్టహాసం చేసిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేడు అమాయకంగా మాట్లాడటం హాస్యాస్పదంగా వుందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయిన తర్వాత 'చంద్రబాబు ముఖం ఇప్పుడు ఎలా ఉంటుందో చూడాలని ఉంది' అని వ్యంగంగా మాట్లాడిన సైకో జగన్, అసెంబ్లీకి వచ్చి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల ముఖాలు ఎలా ఉన్నాయో తనివి తీరా చూసుకోవచ్చని అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి భార్య విజయమ్మను, కూతురు షర్మిలను వర్రా రవీందర్ రెడ్డి, బోరుగడ్డ అనిల్, శ్రీరెడ్డిల చేత నీచాతి నీచంగా తిట్టించింది జగన్ దంపతులు కాదా అని కనపర్తి ప్రశ్నించారు. సీనియర్ జర్నలిస్ట్ అంకబాబు, కుండబద్దలు సుబ్బారావు, రంగనాయకమ్మలను అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టిన విషయం జగన్ మర్చిపోయారా అని ప్రశ్నించారు. తాజా అరెస్టులు, బెయిల్‌తో ముగిసిపోయిందని అనుకోవద్దని, అసలు కథ ఇక ముందు ఉండబోతోందని హెచ్చరించారు.

మూసపోసిన వ్యవసాయానికి వారు స్వస్తి పలికారు. దీర్ఘకాలిక సాగు.. బరువైన పెట్టుబడులు పెట్టాల్సిన పంటలు వద్దనుకొని కూరగాయల బాట పట్టారు. కేవలం 45 రోజుల్లో చేతికి వచ్చే రకాలను సాగు చేస్తూ మూడు రాష్ట్రాలకు కూరగాయలు సరఫరా చేస్తున్నారు. నూతన పంథాలో పెట్టుబడులు పోగా అంతో ఇంతో వెనకేసుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇదీ గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వేజెండ్ల రైతుల విజయగాథ.



మూడు రాష్ట్రాలకు కూరలిస్తున్నారు !

● వేజెండ్ల రైతుల విజయప్రస్థానం

● రకం ఏదైనా వినూత్నంగా కూరగాయలుసాగు
● దొండ, చిక్కుడు, దోస, బీర, బెండల్లో అధిక దిగుబడులు
● 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకం

గుంటూరు సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఇక్కడ కూడా అందరూ పత్తి, మిరప వంటి వాణిజ్య పంటలు వేసి చేతులు కాల్చుకున్నవారే. తెగుళ్లు ఎక్కువ కావటంతో ఆయా పంటల సాగు లాటరీగా మారిన వేళ ప్రత్యామ్నాయం వైపునకు అడుగులు వేశారు. చిన్నగా కూరగాయల సాగు ఆరంభించారు. మొదట్లో పది ఎకరాలతో కొత్త సాగు ఆరంభం అయింది. గ్రామ పరిధిలో ఉన్న సుమారు 1800 ఎకరాల సాగు భూమిలో ప్రస్తుతం చాలా వరకు కూరగాయలు, వరి పండుతున్నాయి. పంటల మార్పును సవాలుగా తీసుకున్న గ్రామ ఆదర్శ రైతులు కూరగాయ విత్తనాలు, నారు, అంట్లు ఎక్కడ బాగుంటాయో విచారించి తెలుసుకొని మరీ వాటిని తీసుకొచ్చి సాగు చేశారు. దొండ అంట్లు(మొక్కలు)కోసం గుజరాత్, బెంగాల్ వరకు వెళ్లి వస్తున్నారంటే సాగు మీద వారికున్న శ్రద్ధను అర్థం చేసుకోవచ్చు.

ఏడాది పంటే కానీ...

ఇక్కడి రైతులు ఎక్కువగా సాగుచేసే కూరగాయల పంటలో మరొకటి కనుపు చిక్కుడు ఒకటి. దాన్ని పెద్ద చిక్కుడు అని కూడా అంటారు. రాజమహేంద్రవరం సమీపంలోని రావులపాలెం నుంచి విత్తనాలు తెచ్చి సాగుచేస్తారు. కట్టే, కాపు వెరైటీ ఇక్కడ ఎక్కువగా సాగు చేస్తున్నారు. పందిరి వేసి తీగను పాకిస్తారు. మే, జూన్ తప్ప అన్ని రోజులు కాపు వస్తుంది. ఇక్కడ జనవరి నెలలో పండే మంచి చిక్కుడుతోనే ఊరగాయ పచ్చడి కూడా పెడతారు. చిక్కుడు ఎకరానికి అల్లు పెట్టించే వరకు సుమారు రూ. 60 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఆ తర్వాత తెగుళ్ల నివారణకు పైమందులు అధికంగానే పిచికారి చేయాలి. మొత్తం పెట్టుబడి రూ. 1.20 లక్షల వరకు అవుతుంది. ఎకరానికి 200 బస్తాలు(ఒక్కో బస్తా 55 కేజీల నుంచి 60 కేజీల) వరకు దిగుబడి వస్తుంది. ఇందులో కొన్ని వెరైటీలు కేవలం ఆరు నెలలు మాత్రమే పంట కాలం. అయితే చిక్కుడు ధర సంవత్సరం పొడవునా రూ.30 నుంచి రూ.120 వరకు ఉంటుంది కాబట్టి రైతుకు కలిసొస్తుంది. ఈ గ్రామంలో ఇవి గాక టమాట, దోస, బీర, బెండ, కాకర, సొర, పొట్ల కాయ వంటి కూరగాయలు సంవత్సరం పొడవునా పండుతూనే ఉంటాయి.


వేజెండ్లలో చిక్కుడు సాగు


వేజెండ్లలో పందిళ్లు వేసిసాగు చేస్తున్న దొండ తోట

ఒకసారి వేస్తే రెండేళ్లు వరకు పంట

వేజెండ్ల రైతులు ప్రస్తుతం సాగుచేస్తున్న దొండ పంటకు పెట్టుబడి ఎకరాకు రూ. 2.50 లక్షల వరకు అవుతుంది. అయితే ఒకసారి అంటు నాటితే అది రెండేళ్ల వరకు పంటనిస్తూనే ఉంటుంది. దొండలో రెండు రకాలు ఉన్నాయి. లావు దొండ, సన్న దొండ. లావు దొండలో రెండు రకాలు, సన్న దొండలో నాలుగు రకాల అంట్లు ఉన్నాయి. కొంత శ్రమతో కూడుకున్నదే అయినప్పటికీ 45 రోజుల నుంచి 60 రోజుల వ్యవధిలో కాపు చేతికి వస్తుంది. ప్రతి కోతకు ఎకరానికి 35 నుండి 40 బస్తాలు దిగుబడి వస్తుంది. వేసవి ఎండలు ఉధృతంగా ఉండే ఏప్రిల్, మే నెలలు తప్ప మిగిలిన అన్ని రోజుల్లో దొండ కాయ కాపు రైతుకు లాభ సాటిగానే ఉంటుంది. సీజన్ బట్టి ధర కాస్త అటూ ఇటూ అయినా అంతిమంగా పెట్టిన పెట్టుబడికి నష్టం అయితే రాదని రైతులు చెబుతున్నారు.

తెగుళ్లు తట్టుకోలేక ఇటువైపు అడుగులు

గవిని హరికృష్ణ, రైతు,వేజెండ్ల



మిరపలో తెగుళ్లు ఎక్కువయ్యాయి. వాటిని తట్టుకోలేక కూరగాయల సాగు వైపు అడుగులు వేశాం. ఈ సాగు బాగానే ఉంది. నష్టం అయితే రాదు. అదృష్టం బాగుంటే రూపాయి కలుస్తుంది. లేకుంటే కూలి మందం మిగులుతాయి. నేను చాలా సంవత్సరాలుగా కూరగాయలు సాగు చేస్తున్నాను. తెగుళ్లు ఇందులో కూడా వస్తాయి. ఎక్కువగా గమనించి జాగ్రత్త పడతాము. గుజరాత్, బెంగాల్ వెరైటీలు తెస్తాము.

నష్టం అయితే రాదు

శనగల వీరారెడ్డి, రైతు, వేజెండ్ల



కూరగాయల సాగు వల్ల పెద్దగా నష్టం వాటిల్లదు. ఒక సీజన్‌లో కాకపోయినా మరో సీజన్‌లో రూపాయి వస్తుంది. పెట్టిన పెట్టుబడికి దిగులుండదు. ఈ ఏడాది సాగు బాగానే ఉంది. దీంతో రైతులకు ఆదాయం ఒకింత బాగానే ఉంది. మార్కెట్‌లో రేట్లు బాగానే ఉన్నాయి. చిక్కుడు వెరైటీ కేజీ రూ. 100కి ధర తగ్గలేదు. దొండకు కూడా మంచి ధర వచ్చింది. వర్షాలకు మొదట కొంత ఇబ్బంది కలిగినా ఇప్పుడు పర్వాలేదు.


నారాకోడూరు కమీషన్ కొట్టు వద్దకు తరలించిన కూరగాయలు

నారాకోడూరు నుంచే సరఫరా...

వేజెండ్లతో పాటు మిగిలిన గ్రామాల్లో పండించిన కూరగాయల పంటను రైతులు నారాకోడూరులో కమీషన్ వ్యాపారుల వద్దకు చేరుస్తారు. ట్రాలీ ఆటోలు, ద్విచక్ర వాహనంపై కూరగాయలను కమీషన్ కొట్లకు చేరుస్తారు. అక్కడ వ్యాపారులు వాటిని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లోని సుమారు 60 మార్కెట్ల కు పంపుతారు. ఇక్కడ కూరగాయలు దిగుబడి తగ్గిందంటే ఆయా రాష్ట్రాల్లో ధరలు ఆసాంతం పెరిగిపోతాయి.

అనేక గ్రామాలకు ప్రేరణ..

వేజెండ్ల రైతులు పంటల మార్పునకు నడుం బిగించిన తర్వాత మండలంలోని మరికొన్ని గ్రామాలు కూడా అదే బాటపట్టాయి. నారా కోడూరులో చాలా కాలంగా కూరగాయలు ఉన్నప్పటికీ సుద్దపల్లి, గుండారం, గొడవర్రు, చేబ్రోలు రెడ్డిపాలెంలో మాత్రం కొన్నేళ్లుగానే ఉంది.

అనువైన భూమి..


మండలంలోని కూరగాయలు సాగుకి అక్కడి భూములు ఎంతో అనువైనవని రైతులు చెబుతున్నారు. నల్లపొలాలు కావటం, ఒండ్రు ఎక్కువగా ఉండటంతో కూరగాయల వేర్లు భూమి లోపల మూడు, నాలుగు అడుగుల వరకు వెళ్లే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. భూమి అనువైనది కావడం తోనే తాము పత్తి, మిరపకు స్వస్తి పలికి కూరగాయల సాగుకు సిద్ధం అయినట్లు చెబుతున్నారు.

వచ్చిన చోటికే రజినీ !



- చిలకలూరిపేటకు విడదల రజనీ
- తాడికొండకు బాలవజ్రబాబు
- రెండు నియోజకవర్గాలకు వైసీపీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం
- సుచరిత స్థానంలో డైమండ్‌బాబుకు ఛాన్స్
- ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

గుంటూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీలో తాజా పరిణామాలపై 'ఆంధ్రజ్యోతి' వెలువరించిన కథనాలు అక్షర సత్యాలయ్యాయి. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంనుంచి ఓటమి చవి చూసిన మాజీ మంత్రి విడదల రజనీ తిరిగి చిలకలూరిపేటకు వెళుతుందని ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం నిజమైంది. అలానే గత ఎన్నికల్లో తాడికొండ నుంచి పోటీ చేసి ఓడిన మాజీ హోం మంత్రి సుచరిత కూడా నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ఏకంగా ఆ పార్టీ అధినేత జగన్‌తోనే చెప్పినట్లు కూడా కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో చిలకలూరిపేట నియోజకవర్గానికి మాజీ మంత్రి విడదల రజనీని, ఎస్సీ రిజర్వు తాడికొండ నియోజకవర్గానికి వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు)ను సమన్వయకర్తలుగా నియమిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ మంత్రి విడదల రజనీ 2024 ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం నుంచి ఓటమి చవిచూసిన విషయం తెలిసిందే. దాంతో ఆమె తిరిగి సొంత నియోజకవర్గమైన చిలకలూరిపేటకు వెళ్లాలని, అక్కడైతేనే తనకు అనుకూల పరిస్థితులుంటాయని ఇటీవల అధినేతతో చెప్పినట్లు సమాచారం. దాంతోనే ఆమెను తిరిగి చిలకలూరిపేటకు సమన్వయకర్త బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. టీడీపీ కంచుకోట అయిన పశ్చిమ నియోజకవర్గం కంటే చిలకలూరిపేటకు వెళ్లాలని రజని భావిస్తున్నారని, అధిష్ఠానం కూడాపేటకు పంపే ప్రయత్నం చేస్తుందని ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'రజనీ పీచేముడ్' పేరుతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇదే అంశం ఇప్పుడు నిజమైంది. మరో వైపు నగర డిప్యూటీ మేయర్‌గా వ్యవహరిస్తున్న డైమండ్‌బాబును ఇటీవల వైసీపీ నగర అధ్యక్షుడుగా నియమించారు. ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన తాడికొండ నియోజకవర్గానికి డైమండ్‌బాబుకు సమన్వయకర్త బాధ్యతలు అప్పగించారు. కాగా పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త బాధ్యతలు ఎవరికిస్తారనేది ఆ పార్టీలో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పశ్చిమ నియోజకవర్గంపై ఇప్పటికే నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు కన్నేశారు. 2024 ఎన్నికల్లో చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి బరిలో దిగిన మేయర్ కావటి మనోహర్ ఓటమి చవిచూసిన విషయం తెలిసిందే. అయితే సొంత నియోజకవర్గమైన పశ్చిమ సమన్వయకర్త బాధ్యతలు అప్పగించాలని స్వయంగా అధినేత జగన్‌ను మేయర్ అడిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పశ్చిమ నియోజకవర్గ బాధ్యతలు అధినేత ఎవరికి అప్పగిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.


డైమండ్ బాబు

ఆదివాసి యువకులను విడుదల చేయాలి

● ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం నాయకుల డిమాండ్

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని మూలవాసి బచావో మంచ్ కార్యకర్తలను చత్తీస్‌ఘడ్ రాష్ట్ర సాయిధ రిజర్వుడు పోలీసులు శుక్రవారం ఉదయం 9 గంటలకు అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని వారిని వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం డిమాండ్ చేసింది. బీజాపూర్ పోలీసులు పెట్రోలింగ్ సమయంలో అనుమానంతో ఈ అక్రమ నిర్బంధానికి పాల్పడ్డారన్నారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్ ప్రాంతంలో యువకులను సీపీఐ (మావోయిస్టు)ల పేరిట కాల్చి చంపుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో యువకుల కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయన్నారు. ఈ అక్రమ నిర్బంధం పట్ల పరిసర ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఈ చర్యల పట్ల తమ తమ ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. నిరసన ర్యాలీకి మద్దతుగా నంబి నుంచి కొండ ఫాలికి వెళుతున్న వారిని అనుమానంతో అదుపులోకి తీసుకున్నారన్నారు. రాత్రి సమయం కావడంతో గుండిర్‌గూడలో నిద్రిస్తున్నవారిని కూడా వదిలి పెట్టకుండా పోలీసులు ఈ అక్రమ అరెస్టుకు పాల్పడ్డారన్నారు. ఈ అరెస్టును పోలీసులు ధ్రువీకరించక పోవడంతో మంచ్ కార్యకర్తల కుటుంబసభ్యులు మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆ విధంగా పోలీసులు అక్రమంగా పట్టుకున్న వారిలో అర్జున్ సోధి, ముయా హేమ్లా , నగేష్ బడ్సే, జోగా మీడియం, గీల్లు కాటం, భీమా కుంజం తదితరులు ఉన్నారని పేర్కొన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న కార్యకర్తలకు ప్రాణహాని తలపెట్టకుండా విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వీ.చిట్టిబాబు, రాష్ట్ర కార్యదర్శి చిలుకాచంద్రశేఖర్ డిమాండ్ చేశారు.

మోటారు సైకిళ్ళ దొంగలు అరెస్టు

● 29 ద్విచక్ర వాహనాలు స్వాధీనం


కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

నరసరావుపేటరూరల్, నవంబరు 8, (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రూరల్ పరిధిలో మోటారుసైకిళ్ళను దొంగిలిస్తున్న ముఠా సభ్యులను నరసరావుపేట రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టుచేశారు. నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం మధ్యాహ్నం 12.30గంటల సమయంలో నరసరావుపేట మండలం కేశానుపల్లి గ్రామ పంచాయతీలోని బైపాస్ వద్ద నరసరావుపేట రూరల్ ఎస్ఐ, సిబ్బంది నిందితులను పట్టుకున్నారని తెలిపారు. వీళ్లు ఇళ్ళ ముందు, బార్‌ల ముందు నిలిపివుంచిన ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తుంటారని తెలిపారు. ఇలా ఈ ముఠా దొంగిలించిన 29 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.16 లక్షలు ఉంటుందని తెలిపారు. పట్టుబడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. పల్నాడుజిల్లాలో నేరాలు, అసాంఘిక కార్యకలాపాలను సహించబోమని, నరసరావుపేట పట్టణంలో గంజాయి, మెడికల్ మాఫీయా, పెస్టిసైడ్ మాఫీయా, పాలల్లో కల్తీ వంటి వాటిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంటుందని, ఎప్పుడైనా దాడులు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం అందించినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. వాహనదొంగలను పట్టుకొన్న రూరల్ సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

వికసిత్ భారత్‌తో స్టార్టప్‌లకు ప్రోత్సాహం


● నూతన ఆవిష్కరణలతో ముందుకు రండి
● మన దేశంలో ప్రస్తుతం 1.12 లక్షల స్టార్టప్ కంపెనీలు
● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్


వికాస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

తుళ్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహం ఉంటుందనీ, నూతన ఆవిష్కరణలతో ముందుకు రావాలని కేంద్ర సహాయక మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం వీఐటీ (వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) ఏపీ విశ్వవిద్యాలయంలో వికాస్ (వీఐటీ ఇన్నోవేషన్ నాలెడ్జ్ అక్విజిషన్ సమ్మిట్) నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయక మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికాస్ నిర్వహిస్తున్న వీఐటీ - ఏపీ విశ్వవిద్యాలయాన్ని అభినందించారు. ఈ వేదిక పరిశ్రమ ప్రతినిధులు, అధ్యాపకులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ఒక్కటి చేసి అంతర్జాతీయ సమస్యలకు పరిష్కారం చూపుతుందని తెలియజేశారు. సహకార పరిశోధన సృజనాత్మక ఆవిష్కరణల ద్వారా దేశాభివృద్ధికి పునాది పడుతుందని అన్నారు. 2024కు ముందు భారత దేశంలో అతి తక్కువ సంఖ్యలో స్టార్టప్‌లుండేవని, ప్రస్తుతం 1.12 లక్షల స్టార్టప్ కంపెనీలున్నాయన్నారు. యూనికాన్ నాలుగు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం 1100 ఉన్నాయని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు. పలువురు పారిశ్రామిక వేత్తలతో చర్చించిన అనంతరం స్టార్టప్స్‌పై విద్యార్థులకు ఉన్న సందేహాలను మంత్రి పెమ్మసాని నివృత్తి చేశారు. వీఐటీ వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ జీ.విశ్వనాథన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంతో ఒప్పందాలు చేసుకుంటున్న 17 మంది పరిశ్రమల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీఐటీ వైస్ ప్రెసిడెంట్ శంకర విశ్వనాథన్, శేఖర్‌విశ్వనాథన్, వైస్ ఛాన్సలర్ ఎస్వీవీ.కోటారెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి, వికాస్ కన్వీనర్ అమిత్ చవాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతికి గ్రామ సీమలే పట్టుగొమ్మలు

● జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రగతికి గ్రామ సీమలే పట్టుగొమ్మలని ఉమ్మడి గుంటూరుజిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. గుంటూరు నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గుంటూరు, బాపట్లజిల్లాలకు చెందిన ఎంపీడీవోలు ,ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి పంచాయతీ రిసోర్స్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ షీలా పద్మరాణి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత స్థానిక స్వపరిపాలన సంస్థలపై ఉందని అన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆయా సంస్థలు పరిష్కరించాలని ఆమె కోరారు. శిక్షణ పొందిన అధికారులు గ్రామాల్లో అన్నిశాఖల ఆధ్వర్యంలో ప్రణాళికను రూపొందిస్తారని పంచాయతీ రిసోర్స్‌మెంటార్, జిల్లాకోఆర్డినేటర్ షీలా పద్మరాణి తెలిపారు. గ్రామస్థాయిలో జనవరిలో, మండల స్థాయిలో ఫిబ్రవరి, జిల్లాస్థాయిలో మార్చి ఆఖరులోగా ప్రణాళికలద్వారా రూపొందించిన కార్యక్రమాలు పూర్తిచేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో డీపీవో నాగ సాయికుమార్, జేడీ కేశవరెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో వీ.జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో పీహెచ్‌కృష్ణ, డాక్టర్‌కూచిపూడి మోహన్ రావు, కే.జియాబేగం, జిల్లాపంచాయతీ వనరుల కేంద్రం జిల్లా శిక్షణ మేనేజర్ కే.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బొమ్మ వదిలింది..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీసర్వేలో పాతిన హద్దురాళ్లపై ఉన్న జగన్ బొమ్మలు, పేర్లను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. ఎక్కువ నిధులు ఖర్చు చేయకుండా బొమ్మలు, పేర్లు చెరిపేయాల్సిందిగా రెవెన్యూ శాఖకు సూచించింది. దీంతో వారం, పది రోజుల వ్యవధిలోనే హద్దు రాళ్లను సాఫీగా మార్చేందుకు చర్యలు చేపట్టేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధమైంది. ఇందు కోసం శాండ్ వాష్ టెక్నాలజీని వినియోగించాలని భావిస్తుంది. ఇది ఒకవేళ ఖర్చుతో కూడుకొనేట్లయితే మాన్యువల్‌గా చేసే వారికి పనిని అప్పగించాలని యోచిస్తున్నది.

- సర్వే హద్దురాళ్లపై జగన్ చిత్రం తొలగింపునకు శ్రీకారం
- రీసర్వే జరిగిన గ్రామాల్లో దాదాపుగా
- 84 వేల రాళ్లు పాతిన గత వైసీపీ ప్రభుత్వం
- 62 గ్రామాల్లో కొద్ది రోజుల్లోనే పనులు ప్రారంభం
- రూ. 12.50 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్న ప్రభుత్వం

గుంటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే కార్యక్రమానికి వైసీపీ ప్రభుత్వం వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంగా పేరు పెట్టి అమలులోకి తీసుకొచ్చింది. గుంటూరు జిల్లాలో తొలుత ఐదు గ్రామాలను ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్టుగా అమలు చేశారు. ఆ తర్వాత మరికొన్ని గ్రామాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించారు. సాధారణంగా ఏవైనా భూముల సర్వేని ప్రభుత్వం చేపడితే హద్దురాళ్లపై ఎలాంటి పేర్లు, బొమ్మలు వేయదు. అలానే టైటిల్ డీడ్ పైనా భూహక్కుదారు పేరు మాత్రమే ఉంటుంది. అలాంటిది వైసీపీ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా టైటిల్ డీడ్‌పై జగన్ ఫోటోలను ముద్రించింది. మరోవైపు భూముల హద్దురాళ్లపై జగన్ ఫోటోలు, పేర్లు, వైసీపీ రంగులను అద్దింది. దీనిపై పలువురు భూయజమానులు అభ్యంతరం పెట్టినా పరిగణనలోకి తీసుకోలేదు. టైటిల్ డీడ్, హద్దురాళ్లపై ఫోటోలు చూస్తే అవి జగన్‌కు చెందిన ఆస్తులన్నట్లుగా చిత్రీకరణ జరిగింది. ఎన్నికలకు ముందు తెలుగుదేశంతో పాటు బీజేపీ, జనసేన పార్టీలు ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాయి. మీ ఆస్తులపై జగన్ ఫోటోలు, పేర్లు ఏమిటి. మళ్లీ అధికారంలోకి వస్తే వీటిని కొట్టేసినా/తాకట్టు పెట్టినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదని హెచ్చరించాయి. దాంతో ప్రజల్లో ఒక చర్చ జరిగింది. తమ భూములను లాక్కొంటారన్న భయం ఏర్పడింది. కాగా గుంటూరు జిల్లాలోని పలు మండలాల్లో 83,770 హద్దురాళ్లను పాతినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వాటిని తొలగించేందుకు ఒక్కో హద్దురాయికి రూ. 15 వరకు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం టెండర్లను నిర్వహించి కాంట్రాక్టర్‌ని ఎంపిక చేస్తారు. కాంట్రాక్టర్ ఎంపిక ప్రక్రియ పూర్తి అయిన తర్వాత హద్దు రాళ్లపై జగన్ బొమ్మలు, పేర్లను సమూలంగా తొలగిస్తారని రెవెన్యూ, సర్వే అధికారులు తెలిపారు.



రేపు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

వట్టిచెరుకూరు, నవంబరు8(ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు గ్రామంలోని విరాట్ ఓతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ జీర్ణోద్ధరణ విగ్రహప్రతిష్ఠా మహోత్సవం, కుంభాభిషేక మహోత్సవాలు ఈనెల 10వతేది జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నూతన ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి వేద పండితులు పూజా క్రతువులను ప్రారంభించారు.

పశ్చిమడెల్టాకాల్వకు

5706 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి), నవంబరు 8: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 5706 క్యూసెక్కుల సాగునీటిని శుక్రవారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 292 క్యూసెక్కుల నీరు, రేపల్లె కాల్వకు 1089 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 580 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 178 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 398 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 3040 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

10న జాతీయ కరాటే

చాంపియన్‌షిప్ పోటీలు

మంగళగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జపాన్ షిటో రియు కరాటే స్కూల్ ఆధ్వర్యంలో 9వ జాతీయ కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీలు ఆదివారం మంగళగిరి ఈద్గా షాదీఖానా మైదానంలో జరుగుతాయని కరాటే స్కూల్ ప్రధాన కార్యదర్శి డి.ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభిస్తారని, కరాటే, వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతారని తెలియజేశారు.

ఖాళీ స్థలం పన్నులకు

ప్రత్యేక కౌంటర్లు

మంగళగిరి సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలో ఖాళీ స్థలాలకు పన్నులు విధించే నిమిత్తం శని, ఆదివారాల్లో మంగళగిరి, తాడేపల్లి కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా తెలిపారు. నగర ప్రజలు దరఖాస్తుతోపాటు సంబంధిత డాక్యుమెంట్లను జతపరిచి తమ ఖాళీ స్థలాలకు పన్నులు వేయించుకోవాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భారీ ఎత్తున

పీడీఎఫ్ నిల్వలు

వట్టిచెరుకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారైన పత్తిపాడు రోడ్డులోని 5వ మైలు సమీపంలో పాడు పడిన జిన్నింగ్ మిల్లు గోడౌన్‌లలో భారీ ఎత్తున పీడీఎఫ్ రైస్ నిల్వలు ఉన్నట్లు శుక్రవారం రాత్రి గుర్తించారు. రాత్రి సమయం కావటంతో ఆ ప్రాంతాన్ని జేసీ, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి, ఇతర అధికారులు ఆ ప్రాంతానికి చేరుకొని భారీ ఎత్తున నిల్వలు ఉండటంతో లెక్కించే సమయం పడుతుందని ఆ గోడౌన్‌లను సీజ్ చేసి భారీ ఎత్తున బందోబస్తును ఏర్పాటు చేశారు.



సీఎం చంద్రబాబుతో చమళ్లమూడి సర్పంచ్

ముఖ్యమంత్రిని కలసిన

సర్పంచ్,వార్డు మెంబర్లు

వట్టిచెరుకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చమళ్ళమూడి గ్రామాభివృద్ధి కోసం పంచాయతీకి కేటాయించిన నిధులను ఎమ్మెల్యే రామాంజనేయులు సహకారంతో విడుదల చేయించాలని చమళ్ళమూడి గ్రామ పంచాయతీ సర్పంచ్ జటావత్ దేవి, వార్డు సభ్యులు యడ్లపల్లి వాణి, గుండవరపు లక్ష్మణ్, సీనియర్ నేత ఆరికపూడి పాపారావు, కే కోటేశ్వరరావులు శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడును కలసి వినతిపత్రం అందజేశారు.

బ్రహ్మోత్సవాలకు

వాహనాలు సిద్ధం

తుళ్లూరు, నవంబరు8(ఆంధ్రజ్యోతి) వెంకటపాలెం టీటీడీ వెంకటేశ్వర స్వామికి దాతలు వాహనాలు సమకూర్చారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా గరుడ వాహనం, హనుమంతు వాహనం, చిన పెద్ద శేషు వాహనాలు నెమలి వాహనం, పొన్న చెట్టు వాహనం, సింహ వాహనం, అశ్వవాహనం, సప్త అశ్వ వాహనం అనే తదిర 12 రకాల వాహనాలను స్వామి వారి సేవలో వినియోగిస్తుంటారు. వీటిని మహాబలేశ్వరంలో తయారు చేయించి సమకూర్చారు. తిరుమల తిరుపతిలలో ఎలాగైతే ఉంటాయో అదే డిజైన్‌తో తయారు చేశారు. ఒక్కో వాహనం వచ్చి 4 నుంచి 6 లక్షల వరకు ఉంటుంది. విజయవాడ, రాజధాని అమరావతి పరిసర ప్రాంతాలకు చెందిన దాతలు స్వామి వారి సేవకు వినియోగించే 12 రకాల వాహనాలు సమకూర్చారు. బ్రహ్మోతవాలు ఇతర ప్రత్యేక కార్యాక్రమాలలో ఈ వాహనాల మీద స్వామి వారిని మాఢ వీధులలో ఊరేగిస్తారు. ఇప్పటికే మాఢ వీధులు వెంకటపాలెం వెంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో పూర్తి చేశారు. ఆయా వాహనాలలో స్వామి వారు బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



వెంకటపాలెం వెంకటేశ్వర స్వామికి దాతలు సమకూర్చిన గరుడ వాహనం

గ్రీవెన్స్‌లో రైతుల సమస్యల పరిష్కారం

- ఏపీ సీఆర్డీయే అదనపు కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్
- పలు దరఖాస్తులకు అక్కడికక్కడే పరిష్కారం

తుళ్లూరు,నవంబరు8(ఆంధ్రజోతి) రాజధాని అమరావతి రైతులు, రైతుకూలీల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్‌డే తోడ్పడుతుందని, వీలైనన్ని సమస్యను అక్కడికక్కడే పరిష్కరితమౌతున్నాయని ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ జీ.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తెలిపా రు. శుక్రవారం తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రీవెన్స్ డే లో రాజధాని రైతులు విశేషంగా పాల్గొని వారి సమస్యలను అదనపు కమిషనర్‌కు విన్నవించుకున్నారు. సీఆర్డీఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై అదపు కమిషన ర్‌కి వచ్చిన సమస్యలలో అధికశాతం అక్కడిక్కడే పరి ష్కారం మార్గం చూపారు. మిగిలిన వాటిని కూడా పరిశీలించి వేగంగా పరిష్కరించాలని అదనపు కమిషనర్ సంబధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 1 వరకు నిర్వహించే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. శుక్రవారం గ్రీవెన్స్‌లో అమరావతిలో భూమి వ్యవహారాలు 49, ప్రణాళిక విభాగానికి 1, సోషల్ డెవలప్‌మెంట్ 1, భూమి సర్వే సమస్య ఒకటి వచ్చాయి. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు కే.స్వర్ణమేరి, బీ.సాయి శ్రీనివాస్ నాయక్, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ జీపీ శివరామకృష్ణన్, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు , తహసీల్దార్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



రైతుల సమస్యలను ఆలకిస్తున్న అదనపు కమిషనర్ జీఎస్ఎస్. ప్రవీణ్ చంద్

రజక కమ్యూనిటి హాల్ నిర్మాణం పూర్తిచేయాలి

తాడేపల్లిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని 17వ వార్డు, 13వ సచివాలయం సర్వే నెం.203/బీ ధోభిఖాన స్థలంలో చిట్యాల ఐలమ్మ రజక కమ్యూనిటి హాల్ నిర్మాణం వెంటనే పూర్తిచేయాలని ఆంధ్రప్రదేశ్ రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మన్నూరి భాస్కరయ్య ఆధ్వర్యంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జా సుబ్బారావు తదితరలు నగరపాలకసంస్థ ఇంజనీరింగ్ అధికారులకు విజ్ఞప్తిచేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు తాడేపల్లిలోని రజకకమ్యూనిటి హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమ్యూనిటి హాల్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని రజక సంఘం నేతలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. 2020 జులై 1న శంకుస్థాపన చేసి నేటికి ఐదు సంవత్సరాలు కాలం గడిచినప్పటికీ నిర్మాణం పూర్తికాకపోవడం దురదృష్టకరమని అన్నారు. వీలైనంత వేగంగా కమ్యూనిటి హాల్ నిర్మాణ పనులను పూర్తిచేయలని వారు కమిషనర్ అలీం బాషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య, నేతలు బొజ్జ సుబ్బారావు, వల్లభాపురం వెంక టేశ్వరరావు, మోర్తోట సుబ్బారావు, తాడేపల్లి సాంబశి వరావు, మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న రజకవృత్తిదారుల సంఘం నాయకులు

రహదారి పనులను ప్రారంభం

కాకుమాను, నవంబరు 8,(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కాకుమాను శివారు ప్రాంతాలో రూ.1.9 కోట్లతో చేపట్టిన రహదారి పనులను శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులతో కలసి మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి రాంగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలన్ని నిర్లక్ష్యానికి గురయ్యాయని తెలిపారు. ప్రధానంగా రాష్ట్రంలో రహదారుల దుస్థితికి వైసీపీయే కారణమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లమోతు పూర్ణచంద్రరావు, బోడపాటి ప్రసాద్, అంకమ్మ చౌదరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నేత చెంగయ్య

పారిశుధ్య కార్మికులకు

వేతనాలు చెల్లించాలి

మంగళగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఆటోనగర్‌లోని ఐలా ఆధ్వర్యంలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నేత ఎస్ఎస్ చెంగయ్య డిమాండ్ చేశారు. మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పారిశుధ్య కార్మికుల యూనియన్ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆర్నెల్లుగా కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, నెలకు కేవలం రూ.10,500 మాత్రమే ఇస్తున్నారని, అవి కూడా సక్రమంగా చెల్లించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 16వ తేదీలోపు వేతనాలు చెల్లించకపోతే 18వ తేదీ నుంచి సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. అనంతరం యూనియన్ నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షురాలిగా కే.నాంచారమ్మ, కార్యదర్శిగా మేడా రామయ్యలతో పాటు 18 మందితో కమిటీని ఎన్నుకున్నట్టు ప్రకటించారు.

భూ సమస్యల పరిష్కారమే

గ్రామ సభల లక్ష్యం

పెదనందిపాడు, నవంబరు, 8 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే గ్రామసభల లక్ష్యమని తహసీల్దార్ శంకరబాబు అన్నారు. మండల పరిధిలోని కట్రపాడు, నాగులపాడు గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో చేపట్టిన భూముల రీసర్వేలో జరిగిన తప్పిదాలను పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, రైతులు వారి భూ సంబంధిత రికార్డులతో దరఖాస్తు చేసుకున్నట్లయితే, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. కట్రపాడులో 90, నాగులపాడులో 43 అర్జీలు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సాహితీమోహన్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు దుర్గాప్రసాద్, లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

14న సీపీఎం

నిరసన కార్యక్రమం

తాడేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న తాడేపల్లి మండల కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తాడేపల్లి పట్టణ సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు కొట్టే కరుణాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం సుందరయ్య నగర్ కృష్ణానది పరివాహక ప్రాంతంలో ప్రజాపోరు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టే నిరసన ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మానవత్వం చాటుకున్న

తాడేపల్లి పోలీసులు

తాడేపల్లి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా మతిస్థిమితంలేక రోడ్డుపై నగ్నంగా తిరుగుతున్న ఓ యువతిని చేరదీసి వస్త్రాలు తొడిగి, సపర్యలు చేసి తాడేపల్లి మహిళా పోలీసులు మానవత్వం చాటుకున్నారు. అనంతరం సీఐ కళ్యాణరాజు ఆదేశాల మేరకు ఆయువతిని స్త్రీ సంక్షేమశాఖ అధికారులకు అప్పగించారు. కొంతకాలంగా ఓయువతి తాడేపల్లి ప్రాంతంలో మతిస్థిమితం లేక ఒంటిపై దుస్తులు లేకుండా రహదారుల్లో తిరుగుతోంది. గమనించిన తాడేపల్లి మహిళా పోలీసులు లలితకుమారి, రమాకుమారి, ఏఎస్ఐ శాంతకుమార్ తదితరులు ఆమెను గమనించి వస్త్రాలుకప్పి, స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులకు అప్పగించారు. మహిళా పోలీసుల ఈ చర్యలను స్థానికులు పలువురు అభినందించారు.



మహిళకు వస్త్రాలు కప్పి సపర్యలు చేసిన పోలీసులు

బాల్య వివాహాలు అనర్థదాయకం



పెదపాలెం గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

దుగ్గిరాల,నవంబరు8: బాల్యవివాహాలు అనర్థదాయకమని, జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకునేంత అవగాహన బాల్య దశలో ఉండదని కోనేరు లక్ష్మయ్య యూనివర్సిటీకి చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండల గ్రామం పెదపాలెంలో కేఎల్‌యూ జాతీయసేవాపథకం కో-ఆర్డినేటర్ పీ.శ్రీకాంత్‌రెడ్డి నేతృత్వంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఇంటింటికీ తిరిగి బాల్యవివాహలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ బాలికల వివాహల విషయంలో తప్పుడ నిర్ణయాలు తీసుకోకూడదని, అది వారి భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. శారీకంగా ఎదగని వయస్సులో వివాహాలు చేయడం, జీవితంపై అవగాహన లేకుండా సంసార బాధ్యతలు స్వీకరించడం ద్వారా మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటారని, ఆరోగ్యకరమైన సంతానాన్ని పొందలేరన్నారు. ప్రధానంగా మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని, ఐన వారి సంబంధమంటూ మగపిల్లలకు 21 ఏళ్లు, ఆడపిల్లలకు 18 ఏళ్ల నిండకుండా వివాహలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం పదిలం


- ఆరోగ్య ఆహార నిపుణురాలు డాక్టర్ సరళఖాదర్
- 'చిరు ధాన్యాలతో జీవనసిరి' అంశంపై శిక్షణ

వట్టిచెరుకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడంద్వారా ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోగలుగుతారని ఆరోగ్య ఆహార నిపుణురాలు డాక్టర్ సరళ ఖాదర్ సూచించారు. మండలంలోని కొర్నెపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్షక సేవా కేంద్రం నిర్వాహణలో శుక్రవారం 'చిరు ధాన్యాలతో జీవనసిరి' అనే అంశంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలిరోజు ప్రారంభ కార్యక్రమానికి డాక్టర్ సరళ ఖాదర్ ముఖ్య అతిథి హాజరై ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హెచ్‌బీఏ-1సీని ఏడు కంటే తక్కువగా ఉంటేనే షుగర్ వ్యాధి లేదని నిర్ధారించు కోవాలని సూచించారు. మన పూర్వీకులు చిరు ధాన్యాలనే ఆహారాన్నే తీసుకొనేవారని, నేడు మనం వివిధ కారణాలతో చిరు ధాన్యాలను పక్కన పెట్టి బియ్యం, గోధుమలు ప్రధాన ఆహారంగా తీసుకోవటం ద్వారానే పలురకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. షుగర్ బాధితులు వరి గోధుమలను పక్కన పెట్టి చిరుధాన్యాలైన కొర్రలు, అండు కొర్రలు తదితర వాటిని ప్రధాన ఆహారంగా తీసుకోలని సూచించారు. అప్పుడే ఆరోగ్య వంతమైన జీవితాన్ని గడపగలుగతామన్నారు. కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ యడపల్లి వెంకటేశ్వర రావు, రైతులు ప్రజలు పాల్గొన్నారు.



'చిరుధాన్యాలతో జీవన సిరి' అంశంపై ప్రసంగిస్తున్న ఆరోగ్య ఆహార నిపుణురాలు డాక్టర్ సరళ ఖాదర్

'చంద్రన్న స్వచ్ఛ సంకల్ప' పై కళాజాత



చంద్రన్న స్వచ్ఛసంకల్పపై కళాజాతాను ప్రదర్శిస్తున్న కళాకారులు

దుగ్గిరాల, నవంబరు, 8 (ఆంధ్రజ్యోతి): మండలగ్రామం తుమ్మపూడి గ్రామంలో శుక్రవారం కళాకారులు చంద్రన్న స్వచ్ఛసంకల్పపై కళాజాత నిర్వహించారు. ఇంటి పరిసరాలతో పాటు, గ్రామమంతా పరిశుభ్రంగా ఉంచడం బాధ్యతగా గుర్తించాలని, తెలియజేస్తూ జానపద కళారూప ప్రదర్శన నిర్వహించారు. ముందుగా వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలను నియంత్రించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు
- గ్రామాల్లో ప్రజాపోరు ఉద్యమం ప్రారంభం

పెదనందిపాడు, నవంబరు, 8 (ఆంధ్రజ్యోతి) : ఓ పక్క ఉపాధి లేక ప్రజలు అల్లాడుతుంటే మరోవైపు నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, వాటి ధరలను తప్పక నియంత్రించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని నాగులపాడు, పెదనందిపాడు గ్రామాల్లో ప్రజాసమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చి ప్రజలపై పెనుభారాలు మోపుతోందన్నారు. అలాగే మరోపక్క కార్పొరేట్ రంగానికి అన్నివిధాలా అండగా ఉంటూ ఆయా కంపెనీల, సంస్థల రుణాలను పెద్ద ఎత్తున రద్దు చేస్తుందన్నారు. ప్రయివేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించడం వలన తీవ్ర నిరుద్యోగ సమస్య నెలకొంటుందన్నారు. రాష్ట్రం, దేశంలో మహిళలు చిన్నారులపై అత్యాచారాలు పెరిగిపోయాయని, ఈ దారుణ అఘాయిత్యాలను నిర్మూలించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జమిలీ ఎన్నికల ప్రతిపాదన ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఉచిత ఇసుక, ఇతర పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సర్‌చార్జీల పేరుతో రూ.6072 కోట్లు ప్రజలపై పెనుభారం మోపుతున్నారని, దీనిని వెంటనే విరమించుకోవాలన్నారు. ప్రజాపోరు ఉద్యమంలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న చేపట్టే నిరసన కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, కాపు వెంకటసుబ్బారావు, కొత్త వెంకటశివరావు, ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, నల్లమోతు రాజేంద్ర, దేవరకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రామారావు

రైతులకు సబ్సిడీపై శనగలు

- తాడికొండ ఏవో పీ.నరసింహరావు

ఫటా ఫట్

తాడికొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శనగలు సబ్సిడీపై రైతులకు విక్రయిస్తున్నట్లు తాడికొండ వ్యవసాయశాఖ ఏవో పీ.నరసింహరావు తెలిపారు. వ్యవసాయశాఖ తరుపున రైతులకు అందిస్తున్న సేవలపై వ్యవసాయశాఖ ఏవో నరసింహరావుతో ఆంధ్రజ్యోతి ప్రతినిధి 'ఫటాఫట్.'



నరసింహరావు వ్యవసాయశాఖాధికారి

ప్ర: శనగలు సబ్సిడీపై కొనుగోలు చేయాలంటే రైతులు ఏమి చేయాలి.?

జ: రైతులు ఆయా గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకుంటే అక్కడే శనగలు కొనుగోలు చేసుకోవచ్చు.

ప్ర: ఎన్ని కేజీలు శనగలు ఇస్తారు..?

జ: ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు ఎకరానికి 25 కేజీల చొప్పున ఇస్తారు. కేజీ శనగలు రూ. 70.50లు. తాడికొండ మండలానికి 240 క్వింటాల శనగలు అందుబాటులో ఉన్నాయి.

ప్ర: ప్రభుత్వం పంటలకు ఇన్సూరెన్స్ ఏమైన ఇస్తుందా...?

జ: రబీ సీజన్‌లో వేసే పంటలకు ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుంది. ప్రతి ఎకరానికి రూ. 40ల నుంచి 70లు చెల్లిస్తే సరిపోతుంది. జొన్న, మొక్కజొన్న, మినుములు, శనగ,పెసర, కంది తదితర పంటలకు ఇన్సూరెన్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చును.

ప్ర: సీసీఐ ద్వారా ప్రత్తి కొనుగోళ్లు ఏమైన చేస్తున్నారా?

జ: మార్కెటింగ్ శాఖ సీసీఐ ద్వారా ప్రత్తిని కొనుగోలు చేస్తుంది. పత్తి మద్దతు ధర క్వింటాకు రూ. 7,521లు చెల్లిస్తుంది. పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 వరకు మాత్రమే ఉండాలి. సీసీఐ ద్వారా పత్తిని విక్రయించే రైతులు ముందుగా రైతు సేవా కేంద్రంలో రైతుల ఆధార్, పాస్‌బుక్ తీసుకొని వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

మంగళగిరి ఆస్పత్రిలో పడకల పెంపు

- 30 నుంచి 100 పడకల ఆస్పత్రిగా మార్పు

అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో ప్రభుత్వాసుపత్రిని ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనిని ఆమోదించారు. ఆస్పత్రికి అవసరమైన సిబ్బందిని రెగ్యులర్, కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించుకునేందుకు కూడా ప్రభుత్వం అనుమతిచ్చింది. ప్రస్తుతం వైద్యులు, సహా సిబ్బందితో కలిపి 23 మంది మాత్రమే ఉన్నారు. వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కావడంతో అదనంగా 73 మంది సిబ్బంది నియామకానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నియామకాలకు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ డైరెక్టర్‌కు అనుమతివ్వడం ద్వారా ప్రస్తుతం అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ సర్వీసును డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు మార్చేకునే అవకాశం కల్పించింది.

20న సాగు నీటి సంఘాలకు ఎన్నికలు

తాడికొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించటానికి షెడ్యూల్ ప్రకటించిందని తాడికొండ తహసీల్దార్ కే. నాసరయ్య తెలిపారు. శుక్రవారం తాడికొండ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తాడికొండ మండలం పరిధిలో ఈనెల 20వ తేదీన సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. నాగార్జున సాగర్ కాల్వలకు సంబంధించి 12 సాగునీటి సంఘాలకు, మైనర్ ఇరిగేషన్ కాల్వలకు సంబంధించి 2 సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈనెల 10వ తేదీన ఓటర్లు జాబితా ప్రకటిస్తామని, 11, 12 తేదీల్లో ఓటర్ల జాబితాల్లో అభ్యంతరాలు స్వీకరించి 13 తేదీన ఓటర్ల జాబితాలను ఫైనల్ చేసి ప్రకటిస్తామన్నారు. ఈనెల 20న ఎన్నికలు జరుగుతాయన్నారు. అంతేకాకుండా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు కోసం సుమారు 2 వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. తాడికొండ మండలం పెద్దది కనుక రెండు పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సర్వసమావేశానికి చాలామంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 12.10కి ప్రారంభమైంది. కార్యక్రమంలో ఎంపీడీవో సమతావాణి, వైస్ ఎంపీపీ బోళ్ల గణేష్ రెడ్డి, అధికారులు,సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పీడీ విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీఎం సురేష్

మహిళల ఆర్థికాభ్యున్నతికి తోడ్పాటునివ్వండి

- జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పీ.విజయలక్ష్మి

దుగ్గిరాల, నవంబరు 8,(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల ఆర్థికా భివృన్నతికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పీ.విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలసమాఖ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏపీఎం సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రతి కుటుంబానికి తోడ్పాటునందించే స్థాయికి స్వయం సహాయక గ్రూపు మహిళలు ఎదగాలన్నారు. అందుకుగానూ రూ.1లక్ష నుంచి రూ.5లక్షల వరకూ అందించే వ్యక్తిగత రుణాల మంజూరును సరళతరం చేయాలన్నారు. 1549 గ్రూపులకు స్త్రీనిధి, ఎస్ఎస్టీసబ్‌ప్లాన్, బ్యాంకురుణాలకు సంబంధించి అన్నివిధాలుగా సహకారం అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. ఏపీఎం సురేష్ మాట్లాడుతూ ఇప్పటికే 30 మందికి వ్యక్తిగత రుణాలను మంజూరు చేయించామని, మరో 30 మందికి అందించే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏ. శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు వీ. సరిత, వీవోఏలు, ఎంఎస్ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ఉర్దూ బాషా దినోత్సవం

పెదకాకాని, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ ఉర్దూ బాషా దినో త్సవం శుక్రవారం ఘనంగా జరి గింది. ఈ వేడుకలకు విభాగం సమన్వయకర్త డాక్టర్ షాబాజ్ అధ్యక్షత వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ మాట్లాడుతూ ఉర్దూ బాషా దినోత్సవ గొప్పతనాన్ని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం 'ఉర్దూ'కు అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఉర్దూభాషపై విద్యార్థులు మక్కువ పెంచుకొని ప్రపంచ దేశాల్లో ఉపాధి పొందాలని సూచించారు. ముఖ్య అతిథి, తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ ఉర్దూవిభాగం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ పోటీలలో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే నసీర్ బహుమతులు అందజేశారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

ఆహార నియమాలు పాటించాలి

- క్యాన్సర్ పరీక్షలపై అవగాహన కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్

పెదనందిపాడు, నవంబరు, 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా ఆహార నియమాలు పాటించాలని డాక్టర్ దగ్గుమాటి శ్రీకాంత్ అన్నారు. మండల పరిధిలోని రావిపాడులో ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన ఉచిత క్యాన్సర్ పరీక్షలపై శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజలు ప్రతి రోజూ కొంత సమయాన్ని శారీరక వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తించి వైద్య చికిత్సను తీసుకున్నట్లయితే ప్రాణాపాయం నుంచి తప్పించేకోవచ్చని తెలిపారు. ఎయిడ్స్, క్షయ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రసాద్‌స్వామి, ఎల్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్ట్ ఆర్గనైజర్ నాగేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలి అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెండో శనివారం మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ జె అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణ, రూరల్ మండల గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మరమ్మతులు జరుగుతాయని వినియోగదారులు సహకరించాలని కోరారు.

తెనాలిలో చోరీ

తెనాలి క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామలింగేశ్వరపేట తోటవారి వీధిలో ఇంటిలో విలువైన వస్తువులు అపహరించారు. వన్ టౌన్ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం.. తోటవారి వీధికి చెందిన విష్ణుబొట్ల ఆంజనేయశాస్త్రి కుటుంబం తణుకులో పూజాది కార్యక్రమాలకు వెళ్లారు. ఇది గమనించిన దొంగలు తలుపులు పగులగొట్టి ఇంటిలోని 7సవర్ల బంగారం, ఐదు కిలోల వెండి వస్తువులు అపహరించారు. వీటివిలువ సుమారు రూ.8 లక్షల వరకు ఉంటుందని సీఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం పరిశీలన చేస్తున్నారని ఆయన తెలిపారు.

రేపు వేదిక్ బ్రాహ్మణ సమాఖ్య కార్తీక సమారాధన

తెనాలి అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక సమారాధన జరుగుతుందని ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణమూర్తి తెలిపారు. నాజరుపేటలోని నృశింహ సదనంలో శుక్రవారం సమారాధన కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, కార్తీక మాసం పురస్కరించుకుని సదన్‌లో జరిగే సమారాధనకు బ్రాహ్మణ సోదర సోదరీమణులంతా హాజరు కావాలని కోరారు. పరమేశ్వరునికి ఏకాదశ రుద్రాభిషేకం జరిపిన అనంతరం లలితా విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహిస్తారు. తిరుమలరావు, రామేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసమూర్తి, అనీల్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జువ్వలపాలెంకు నైట్ హాల్ట్ సర్వీసు కొనసాగించాలని వినతి

తెనాలి అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొల్లూరు మండలం జువ్వలపాలెం గ్రామానికి ఆర్టీసీ బస్సు నైట్ హాల్ట్ సర్వీసు పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరారు. శుక్రవారం ఆర్టీసీ డిపోలో వినతి పత్రం అందజేశారు. గ్రామానికి మూడు ట్రిప్పులు బస్సు సౌకర్యం ఉండేదని, రెండేళ్ల నుంచి నైట్ హాల్ట్ సర్వీసు రద్దు చేశారని, దీని కారణంగా వేకువ జామున దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. లంక గ్రామాల్లోని ఏడు గ్రామాల ప్రజలకు ఈ సర్వీసు ఉపకరిస్తుందని తెలిపారు. ములకా శివసాంబిరెడ్డి, వెంకట్రామయ్య, జీవన్, కృష్ణమోహన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికభారం తగ్గించాలి: సీపీఎం

తెనాలి అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజలపై రోజు రోజుకు పెరుగుతున్న ఆర్థిక భారం తగ్గించాలని సీపీఎం జిల్లా నాయకులు భవన్నారాయణ కోరారు. ప్రజాపోరు కార్యక్రమం పేరిట పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు కాలనీలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొల్లిపర బాబుప్రసాద్, ములకా శివసాంబిరెడ్డి, హుస్సేన్‌వలి, జోసేఫ్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఖాతాదారులకు ప్రత్యేక సేవలు: కరుణాకరబాబు

తెనాలి, మారీసుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా పోస్టల్ ఖాతాదారులకు ప్రత్యేక సేవలను అందిస్తామని పోస్టల్ డివిజన్ సూపరిడెంటెంటు కరుణాకర్ బాబు తెలిపారు. స్థానిక కొత్తపేటలోని పోస్టల్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం తెనాలి పోస్టల్ డివిజన్ సూపరింటెండెంటు కరుణాకర్‌బాబు ఖాతాదారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు సంబంధించిన నగదు బదిలీ పద్ధతి (డీబీటీ) సేవలు పొందవచ్చన్నారు. డివిజన్ వ్యాప్తంగా పోస్టాఫీసులలో ఈ నెల 15వ తేదీ వరకు ఆధార్ అనుసంధానంపై స్పెషల్ క్యాపులను నిర్వహిస్తున్నామన్నారు.


పౌష్టికాహార కిట్లు అందించడం అభినందనీయం

● సర్పంచ్ జయనాగలక్ష్మి

తెనాలి మారీసుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పౌష్టికాహార లోపాలు తలెత్తకుండా కుమార్ మోటర్ పంప్స్ వారు మంచి మనస్సుతో ఆ కిట్లను ఉచితంగా అందించడం అభినందనీయమని సంగంజాగర్లమూడి గ్రామ సర్పంచ్ జయనాగలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని సంగం జాగర్లమూడిలో కుమార్ గ్రూప్‌ఆఫ్ ఇండస్ట్రీస్ సహకారంతో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామసర్పంచ్ జయనాగలక్ష్మి, రవీంద్రబాబు, టీడీపీ నాయకులు కొత్త రమేష్‌బాబు, ఎంపీటీసీ పసుపులేటి నరసమ్మ పాల్గొని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

తెనాలి 27వ వార్డులో...

తెనాలి మారీసుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని 27వ వార్డు కౌన్సిలర్ బోయపాటి అరుణ అన్నారు. శుక్రవారం స్థానిక 27వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలను పరిశీలించి, పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



● తెనాలి అర్బన్: అరవింద సొసైటీ, విద్యా కేంద్రం వ్యవస్థాపకులు గుళ్లపల్లి సత్యనారాయణ సంస్మరణ సభ శనివారం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

చీకటి పడకముందే వీధి దీపాలు

● పని చేయని ఆటోమెటిక్ విధానం
● ప్రజాధనం వృథా...

తెనాలి అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చీకటి పడకముందే వీధిదీపాలు వెలుగుతూ ఉండటంతో ప్రజాధనం వృథా అవుతోంది. పలుచోట్ల ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ విధానం పని చేయకపోవడం వల్ల విలువైన విద్యుత్ కూడా వృథా అవుతోంది. పట్టణంలోని 40వ వార్డులలో సుమారు 9వేలకు పైగా వీధి దీపాలు ఉన్నాయి. వీటివలన రూ.9 లక్షలు విద్యుత్ బిల్లు చెల్లింపులు జరుగుతున్నాయి. 204 బాక్సులు ఏర్పాటుచేసి వీటిని నిర్వహిస్తున్నారు. కాలానికి అనుగుణంగా చీకటిపడే సమయానికి వీధి దీపాలు వెలిగేలా వేకువ జామున వెలుగువచ్చే సమయానికి ఆగిపోయేలా ఆటోమెటిక్ విధానాన్ని 80శాతం వరకు ఏర్పాటుచేశారు. కానీ కొన్నిచోట్ల పని చేయకపోవడంతో ప్రస్తుతం 6 గంటలకే చీకటి పడుతుండగా 5.15, 5.30 గంటలకే వెలగడంతో విలువైన విద్యుత్ వృథా కావడంతో పాటు ప్రజాధనం కూడా వృథా అవుతోంది. ఆటోమెటిక్ విధానం లేని చోట్ల కూడా ఆపరేటర్లు చీకటి పడకముందే వీధి దీపాలు ఆన్ చేసి ఓ పని అయిపోతుంది చాలు అనే విధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పట్టణం మొత్తం వీధి దీపాల నిర్వహణ బాధ్యతలను మున్సిపల్ ఇంజనీర్ పర్యవేక్షిస్తుండగా వార్డుల వారీగా అసిస్టెంట్ ఇంజనీర్లు పర్యవేక్షిస్తున్నారు. వీధి దీపాలు వెలుగు లోపాలను సమీక్షించి చీకటి వెలుతురుకు అనుగుణంగా వెలిగేలా చూడాలని తద్వారా ప్రజాధనం, విలువైన విద్యుత్ వృథా కాకుండా చేయాలని పలువురు సూచిస్తున్నారు.


కాల్వ కట్టపై వెలుగుతున్న వీధి దీపాలు


బుర్రిపాలెం రోడ్డులో వెలుగుతున్న వీధి దీపాలు

ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలి

● సీపీఎం నాయకుల డిమాండ్ ● పెరిగిన నిత్యావసరాల ధరలు, విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ ధర్నా

పెదకాకాని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న పేదలకు తక్షణమే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పెదకాకానిలో శుక్రవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద బేతపూడి బాబురావు అధ్యక్షతన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై నేతాజీ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చాక నిత్యావసరాలు పెట్రోల్ డీజిల్ గ్యాస్, కరెంటు చార్జీలు అదుపు లేకుండా పెరిగాయని జీఎస్టీ పేరుతో ప్రజలపై విపరీతమైన భారాలు మోపారని జమిలి ఎన్నికలు ఒక ఎన్నిక, ఒకే దేశం అనే పేరుతో కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా కార్మికులకు నష్టం కలిగించేలా కార్మిక చట్టాల్లో మార్పు చేశారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్‌పరం చేయటం వలన నిరుద్యోగం విపరీతంగా పెరిగిందని కేంద్ర ప్రభుత్వం విధానాలు ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేసే ప్రయత్నం చేస్తుందని పెరిగిన నిత్యవసరాల ధరలు తగ్గించాలని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ చేయటం ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ కన్వీనర్ నన్నపనేని శివాజీ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న పేదలకు సుందరయ్య కాలనీ స్వర్ణపురి కాలనీ ఎన్టీఆర్ కాలనీ వడ్డెర కాలనీ శ్రీలక్ష్మీ దుర్గ కాలనీలలో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని ఇళ్ల స్థలాలు లేని పేదలకు గతంలో రాజధానిలో పట్టాలు ఇస్తామని మోసం చేశారని పెదకాకాని మండలం గ్రామాలలో ఏ గ్రామంలో అయితే నివాసం ఉంటున్నారో అక్కడే పట్టాలు ఇవ్వాలని రోడ్లు డ్రెయినేజీ తాగునీరు మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బురదగుంట సాంబయ్య కే సత్యనారాయణ ఉల్లంగుల శివయ్య, కె రాఘవయ్య జెట్టి రాజలక్ష్మి, పూర్ణకంటి నాగమణి, ఏ నాగేశ్వరావుతదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం ఇచ్చారు.


పెదకాకాని తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు నేతాజీ, శివాజీ తదితరులు


రైతులకు తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న డీవీసీ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ నిర్వాహకులు

రైతు సేవకే డీవీసీ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ: మాదాల

పొన్నూరు టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు సేవలు అందించటానికి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీని రైతుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసినట్లు ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని మునిపల్లెలో శుక్రవారం డీవీసీ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ సమావేశం జరిగింది. బేయర్ కంపెనీ ప్రతినిధులు రైతులకు మొక్కజొన్న, వరి, తెల్లజొన్న, పెసర, మినుము పంటల సాగుపై సూచనలు, సలహాలు అందించారు. సమావేశంలో హార్టీకల్చర్ అధికారుల సహకారంతో 50మంది రైతులకు సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లును పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంపెనీ పాలకవర్గ సభ్యులు సౌపాటి వెంకట్రావు, సజ్జ బ్రహ్మయ్య, బొద్దులూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు బొర్రు రామారావు, బండ్లమూడి బాబురావు, చల్లంశెట్టి సీతరామయ్య, గనిపిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

నిత్య అన్నదాన పథకానికి రూ.50వేలు విరాళం

పెదకాకాని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్య అన్నదాన పథకానికి రూ.50వేలు విరాళం అందించారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన షోడా రత్నాచారి, లక్ష్మీ కనకదుర్గ దంపతులు శుక్రవారం అందించినట్లు దేవస్థాన ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరాళాలు సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించవలసిందిగా ఉప కమిషనర్ భక్తులకు విజ్ఞప్తి చేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం చేయించి, స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించినట్లు ఆయన తెలిపారు.


ఆలయ ఉప కమిషనర్ కె.బి.శ్రీనివాసరావు విరాళం అందజేస్తున్న దాతలు

హత్యాయత్నం కేసులో ఒకరికి జైలు శిక్ష

కొల్లిపర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొల్లిపర పోలీసుస్టేషన్ పరిధిలోని తూములూరులో జరిగిన అల్లర్లల్లో ఒక వ్యక్తిపై హత్యాయత్నం చేసి గాయపర్చిన కేసులో నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తూములూరులో 2022లో జరిగిన అల్లర్లల్లో కొల్లూరు మండలం ముసళ్లపాడుకు చెందిన అమృతలూరు పవన్ అలియాస్ మణి ఒక వ్యక్తిపై హత్యాయత్నం పాల్పడ్డాడు. అప్పటి ఎస్ఐ బలరామిరెడ్డి కేసునమోదు చేసి చార్జ్‌షీటు దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం నేరం రుజువు కావటంతో ముద్దాయి అమృతలూరి పవన్‌కు తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ జడ్జ్ శ్రీధర్ మూడు సంవత్సరాలు జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. పీపీ ఎలిజిబెత్‌రాణి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

ఏఎన్‌యూ లో ఘనంగా ఉర్దూ దినోత్సవం

పెదకాకాని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ ఉర్దూ దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు విభాగం సమన్వయకర్త డాక్టర్ షాబాజ్ అధ్యక్షత వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న గుంటూరు తూర్పు శాసన సభ్యుడు నజీర్ అహ్మద్ మాట్లాడారు. ఉర్దూ దినోత్సవ గొప్పతనాన్ని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ భాషకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తాత్కాలిక ఉప కులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ ఉర్దూ విభాగం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఉర్దూ దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విద్యార్థులకు శాసనసభ్యుడు నజీర్ అహ్మద్, బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో తాత్కాలిక రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి, తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, విభాగం అధ్యాపకుడు డాక్టర్ ఫౌజియా, డాక్టర్ షబ్బీర్ బాష, నళిని తదితరులు పాల్గొన్నారు.


వర్సిటీలో జరిగిన ఉర్దూ దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, విద్యార్థులు

దావులూరు, అత్తోట ఫీడర్ పరిధిలో విద్యుత్ నిలిపివేత

కొల్లిపర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అత్తోట, దావులూరు ఫీడర్ పరిధిలో మరమ్మతులు నిమిత్తం విద్యుత్ నిలిపివేస్తున్నట్లు సబ్‌ఇంజనీర్ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్తోట ఫీడర్ పరిధిలో చివలూరు, సిరిపురం, అత్తోట, కుంచవరం, దంతలూరు గ్రామాల్లో దావులూరు ఫీడర్‌లో దావులూరు, చెముడుబాడు గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు.

పీఎం సూర్య ఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● సబ్‌ఇంజనీర్ సత్యనారాయణ

కొల్లిపర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులు భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా సరికొత్త పథకాన్ని తీసుకువచ్చిందని సబ్ ఇంజనీర్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర పంచాయతీ కార్యాలయం ఆవరణలో పీఎం సూర్యాఘర్ సబ్సిడీ సోలార్ విద్యుత్ పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. సదస్సుకు సూర్య సోలార్ ఎండీ కేఎస్ రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా రూ.78వేల వరకు రాయితీ పొందవచ్చునన్నారు. ఇంటిపై సోలార్‌ను ఏర్పాటు చేసుకోవటానికి అన్ని బ్యాంకుల్లో తేలిక వాయిదాల్లో రుణసదుపాయాన్ని పొందవచ్చునన్నారు. సామాన్య ప్రజలు సబ్సిడీపై సోలార్ విద్యుత్ పథకాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో సర్పంచ్ పిల్లి రాధిక, పంచాయతీ కార్యదర్శి అలకనంద, విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయండి

● తహసీల్దార్ గోపాలకృష్ణ ● ఓటుహక్కుకు 3650 అప్లికేషన్లు

తెనాలి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు నమోదు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని తహసీల్దార్ గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం తెనాలిలో తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెనాలి మండలంలో ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ ద్వారా 3650 అప్లికేషన్లు అందాయన్నారు. వాటి పరిశీలన ప్రక్రియను ఆయా గ్రామాల్లో బీఎల్‌వోలు, వీఆర్వోలు, సర్వేయర్లు ఇప్పటికే ప్రారంభించారన్నారు. ప్రస్తుతానికి 450 అప్లికేషన్లను పరిశీలించడం జరిగిందన్నారు. ఓటు హక్కుకు స్థానికుడై ఉండి 01-11-2021 నాటికి డిగ్రీ పూర్తిచేసి ఉంటే సరిపోతుందన్నారు. ఉద్యోగిగా ఉంటే సంబంధిత కార్యాలయం నుంచి క్వాలిఫికేషన్ వివరాలను అందిస్తే సరిపోతుందన్నారు. శనివారం ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని ఓటరు కార్డులో పేర్లు, ఇతర వివరాలు మార్పులు చేర్పులు వంటివి చేసేలా ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గోపాలకృష్ణ కోరారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించండి

● మున్సిపల్ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించి, వ్యర్థాలను తొలగించాలని పట్టణ మున్సిపల్ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు సూచించారు. స్థానిక కొత్తపేటలోని 7వ వార్డులో శుక్రవారం పారిశుధ్య పనులను పురపాలక సంఘ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు క్షేత్రస్థాయిలో పరిశీలించి జేసీబీతో తొలగిస్తున్న పనులను పరిశీలించి శానిటరీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డును పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ప్రజలు వ్యర్థాలను, చెత్తను మురుగు కాలువలు, డ్రెయిన్‌లలో వేయరాదన్నారు. మూడు బుట్టల విధానాన్ని అనుసరించాలన్నారు. అనంతరం 28, 32వ వార్డులలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


జేసీబీతో వ్యర్థాల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు తదితరులు

డిసెంబరు 10న వికలాంగుల సంక్షేమ దినోత్సవం

పొన్నూరు టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 10వ తేదీన వికలాంగుల సంక్షేమ దినోత్సవం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తునటట్లు వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మురుగుల సాంబశివరావు తెలిపారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి ఏటా డిసెంబరు 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. ఈ ఏడాది పొన్నూరు నియోజకవర్గంలో 3వ తేదీన కాకుండా 10వ తేదీన ఈ కార్యక్రమం నిర్వహిస్తునట్లు చెప్పారు. నియోజకవర్గంలోని వికలాంగులందరూ తేదీ మార్పును గుర్తించి 10వ తేదీన హాజరు కావాలని కోరారు. సమావేశంలో వికలాంగుల సమస్యలపై చర్చించనునట్లు చెప్పారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రాంబాబు నాయిక్, దారా రామారావు, షేక్ సుభానీ, కందుల బుల్లి వెంకటేశ్వర్లు, కాట్రగడ్డ విజయ్ కుమార్, బేతపూడి ఏసుబాబు, కత్తిగోపి కృష్ణ, శిలం మంత్రయ్య, నరసింగం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● మున్సిపల్ వైద్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల





తెనాలి, మారీసుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండి వాటి భారిన పడకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని మున్సిపల్ వైద్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల చెప్పారు. శుక్రవారం ఆంధ్రజ్యోతితో సీజనల్ వ్యాధులపై వెల్లడించిన వివరాలు..

ప్రశ్న: సీజనల్ వ్యాధులంటే ఏమిటి?

జవాబు: వాతావరణంలో చోటుచేసుకునే మార్పుల వలన వచ్చే అనారోగ్య సమస్యలను సీజనల్ వ్యాధులని అంటారు.

ప్ర: సీజనల్ వ్యాధుల లక్షణాలు ఏంటి?

జ: జలుబు, దగ్గు, కఫం, జ్వరం, తలనొప్పి, వంటి నెప్పులు లాంటి సమస్యలు ఉత్పన్నమౌతాయి.

ప్ర: సీజనల్ వ్యాధులబారిన పడినవారికి ఎలాంటి వైద్య సేవలు అందిస్తారు?

జ: వార్డుల వారీగా హెల్త్ క్యాంపులను నిర్వహిస్తాం. క్యాంపుల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందిస్తాం. పలు రకాలుగా అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలను ఆరోగ్యంపై చైతన్యవంతుల్ని చేస్తాం.

ప్ర: సీజనల్ వ్యాధులు సోకినవారు ఎటువంటి ఆహారం తీసుకోవాలి?

జ: కాచి చల్లార్చిన నీరు తాగటం, తాజా కూరగాయలు, ఆకుకూరలు, తగినంత విశ్రాంతి తీసుకోవడం ద్వారా త్వరగా కోలుకొనే అవకాశం ఉంటుంది.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

తెనాలి, మారీసుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థినికి చదువుకునేందుకు ఆర్థికసాయాన్ని హెల్పింగ్ సోల్జర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు శుక్రవారం అందజేశారు. స్థానిక శివాజీచౌక్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుకుంటున్న సైనీ రాణి అనే విద్యార్థినికి హెల్పింగ్ సోల్జర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి షేక్ ఇనాయితుల్లా రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు జాస్తి మోహన్‌రావు, శివ, తేజ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినికి ఉపకార వేతనం అందిస్తున్న హెల్పింగ్ సోల్జర్స్ సభ్యులు


కొప్పురావూరులో జరిగిన గ్రామసభలో పాల్గొన్న మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కామినేని, సర్పంచ్ ఆలా, ఉప సర్పంచ్ విన్నకోట పూర్ణ శంకర్రావు.

రైల్వే ట్రాక్ ఏర్పాటుకు భూములు ఇస్తాం

● కొప్పురావూరు గ్రామ సభలో ఏకగ్రీవంగా తీర్మానం

పెదకాకాని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నంబూరు రైల్వేస్టేషన్ నుంచి రాజధానికి ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక రైల్వే ట్రాక్‌కు కొప్పురావూరు గ్రామ రైతులు పూర్తిగా సహకారం అందించి, భూములు ఇచ్చేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. శుక్రవారం గ్రామ సర్పంచ్ ఆలా సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, కొప్పురావూరు గ్రామ ఉపసర్పంచ్ విన్నకోట పూర్ణశంకర్రావులు మాట్లాడుతూ కొప్పురావూరు గ్రామ సమీపంలో గుండా రైల్వేట్రాక్ ఏర్పాటుకు తమ గ్రామానికి చెందిన రైతులు భూములు పెద్దఎత్తున ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అయితే గ్రామ రైతులు భూములు ఇవ్వడం వలన జీవనోపాధి కోల్పోతున్నారని, అందుకని వారికి ప్రత్యేక ప్యాకేజీ కింద భారీగా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. భూములు కోల్పోయిన రైతులకు ల్యాండ్ పూలింగ్ కింద రాజధానిలో ప్లాట్లు కేటాయించాలని కోరారు. గ్రామ శివారులో గుండా రైల్వే ట్రాక్ ఏర్పాటు చేయటం అందరికీ సమ్మతమేనన్నారు. భూములు కోల్పోయిన రైతుల కుటుంబాల్లోని వారికి రైల్వే శాఖలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.


మినుము విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

మినుము సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

పొన్నూరు టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మినుము సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఏడీఏ వి.రామకోటేశ్వరి అన్నారు. మండల పరిధిలోని వెల్లలూరు రైతు సేవా కేంద్రంలో శుక్రవారం దాళ్వా సాగులో మినుము సాగు చేసే రైతులకు వీబీఎన్ 8 అనే రకం మినుము చిరు విత్తనాల సంచులను పంపిణీ చేశారు. పోషణ ఆహార భద్రతా పథకంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో కొద్దిమంది రైతులకు ఈ చిరు మినుముల విత్తనాల సంచులను ఉచితంగా పంపిణీ చేయనునట్లు అధికారులలు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారులు మాట్లాడుతూ ఈ మినుము 65 నుంచి 75 రోజుల కాలపరిమితిలో దిగుబడికి సిద్ధం మవుతుందన్నారు. పల్లాకు తెగులను తట్టుకుంటుందన్నారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న పీయూ 31 రకానికి వీబీఎన్ 8 ప్రత్యమ్నాయంగా చెప్పారు. కార్యక్రమంలో ఆహార భద్రతా పథకం సాంకేతిక సహాయులు శ్రీనివాస్, టీడీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు, బండ్లమూడి బాబురావు, గనిపిశెట్టి రామకృష్ణ, ఏవో డేగల వెంకట రామయ్య పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

కృష్ణా జిల్లా, ఉయ్యూరు మండలం మరియు గ్రామం, డోర్ నెం.3-9రు కాపురస్తులు చెరుకూరి భరత్ కుమార్ గారి భార్య చెరుకూరి రాజేశ్వరి (ఆధార్ నెం. 8311 7512 1995) అను నేను ప్రమాణ పూర్వకముగా వ్రాయించియిచ్చిన అఫిడవిట్. నా నాయనమ్మ గారైన ఉండవల్లి కోటేశ్వరమ్మ గారి పేరిటకు గుంటూరు జిల్లా రిజిష్ట్రారు వారి కార్యాలయంలో రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు నెం.8104/1994 ఒరిజినలు ది.03-10-2024న గుంటూరు నుండి ఉయ్యూరు వెళుతూ మార్గమధ్యలోని పెదకాకాని శివాలయం వద్ద ఆగి గుడిలోకి వెళ్లి మరలా బయటకు వచ్చి చూడగా బండి ముందు ఇంజన్ ట్యాంకు కవరులో పెట్టిన దస్తావేజు కనిపించలేదు. దీని కోసం ఆ ప్రాంతమంతయూ వెతికినను, పలువురిని విచారించినను ఎటువంటి ప్రయోజనం లేకపోయింది. సదరు దస్తావేజును నేను ఎక్కడా ఎవరి వద్ద తాకట్టు పెట్టడం గానీ, అన్యాక్రాంతములు చేయడం గానీ మరియు స్వప్రయోజనాల కోసం ఎక్కడైనా వినియోగించడం వంటివి చేయలేదు. పైన తెల్పిన విషయములన్నియు యదార్థములు, భవిష్యత్తులో ఈ విషయమై ఎటువంటి అక్రమాలు బయటపడినా అందుకు సంబంధించి భర్త వారు తీసుకొను ఎటువంటి సివిల్ మరియు క్రిమినల్ చర్యలకైనా నేనే పూర్తి బాధ్యత వహిస్తానని తెలియపరుస్తున్నాను

సి.హెచ్.రాజేశ్వరి, డిపోనెంట్-9059374756

శివాజీచౌక్‌లో అన్నదానం

తెనాలి అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాజీ చౌక్‌లో శుక్రవారం అన్నదానం చేశారు. కాళీమాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండోవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్, కె.సీతారామయ్య కుటుంబ సభ్యులు దామోదరరావు, శైలజ, శివరామకృష్ణ, మౌనిక, కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, సీతారామయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

